శుక్రవారం
28-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 158
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

తాగునీటికి ప్రాధాన్యం

- శ్రీశైలం, సాగర్ జలాలు జాగ్రత్తగా వాడుకోవాలి
- పక్షం రోజులకొకసారి సమావేశం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు కేఆర్ఎంబీ సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సూచించింది. కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వాన గురువారం హైదరాబాద్ జలసౌధలో ఉభయ రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులతో బోర్డు ప్రత్యేక సమావేశం నిర్వహించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఇతర ఇంజినీర్లు హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే

- మిగతా 2 లో

ఐలమ్మ వర్సిటీని ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరిస్తాం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు కావలసిన నిధులను సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐలమ్మ వర్సిటీ (కోటి ఉమెన్స్ కాలేజ్)ని గురువారం ఆయన సందర్శించారు. వర్సిటీ ప్రాంగణంలో హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు. విద్యార్థినులకు తరగతి గదులు, ల్యాబ్స్, లైబ్రరీ, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావలసిన వసతి గృహాలు, వైస్ ఛాన్సలర్ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు స్థలాలు పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణ నమూనాలను తిలకించారు. ఇటీవల పునరుద్ధరించిన దర్బార్ మహల్ పైఅంతస్తులో 1779-1947 మధ్య హైదరాబాదులో పనిచేసిన 57 మంది బ్రిటిష్ రెసిడెంట్లకు సంబంధించిన చిత్రపటాలు, వారి పదవీ కాలంలో నగర రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించి ప్రదర్శించిన చిత్రపటాలను ఆసక్తిగా తిలకించారు. బ్రిటిష్ రెసిడెన్సి చరిత్రను విజిటర్ మేనేజర్ సతీశ్... భట్టి విక్రమార్కకు సమగ్రంగా వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వర్సిటీలో నిర్మించబోయే భవన నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజినీరింగ్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా మిగిలిపోయే విధంగా ఉండాలని సూచించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రానా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన,

- మిగతా 2 లో

తెలంగాణ అభివృద్ధి ఆగదు

- ఉపాధి కాల్పనలో రాష్ట్రం నంబర్ వన్
- డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో పురోగతి
- హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ఎదుగుదలను, అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రగతి పథంలో తెలంగాణ దూసుకెళుతోందని, ఉపాధి కల్పనలో నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, కృత్రిమ మేథ రంగాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ముందుకెళుతూ అవకాశాలు సృష్టించుకుంటోందన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల రంగంలోనూ హైదరాబాద్ రాణించాలని ఆకాంక్షించారు. డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్,

- మిగతా 2 లో

కుంభమేళాకు గిన్నిస్ రికార్డులు

లక్నో: ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజుల పాటు జరిగిన మహా కుంభమేళ గిన్నిస్ రికార్డులు నమోదు చేసుకొంది. కుంభమేళలో 65 కోట్ల మంది భక్తులు పాల్గొన్నారు. కుంభమేళాలో భాగంగా 10,102 మంది హ్యాండ్ పెయింటింగ్ చేయడంతో గిన్నిస్ రికార్డు నమోదైంది. వారంతా సమైక్యత, సామాజిక సామరస్యం, సమగ్రతలో ఏకత్వం అనే స్ఫూర్తితో తమ భావాలను వ్యక్తపరిచారు. అలాగే, 15వేల మంది పారిశుధ్య కార్మికులతో డ్రైవ్ నిర్వహించడం, ప్రపంచంలోనే తొలిసారి సామూహికంగా నది ప్రక్షాళన కార్యక్రమం జరగడంతో గిన్నిస్ రికార్డులు నమోదయ్యాయి.

ముగిసిన వంశీ కస్టడీ విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మూడు రోజుల కస్టడీ విచారణ ముగిసింది. మూడోరోజు గురువారం విచారణ నిమిత్తం జైల్లో ఉన్న వంశీని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ భవనంలో వంశీని విచారించారు. ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్, ఇతర అధికారులు విచారణలో ఉన్నారు. రెండు రోజుల విచారణలో అనేక ప్రశ్నలకు వంశీ సమాధానాలు దాటవేశారు. మూడో రోజు మరింత

- మిగతా 2 లో

90 వేల కెమెరాలతో తాలిబన్ల 'నిఘా'

కాబూల్: అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల పాలనలో ఆంక్షలు పెరిగిపోయాయి. రాజధాని కాబూల్‌లో వేలాదిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నేరాల నిరోధానికే ఈ చర్యలు తీసుకున్నట్లు తాలిబన్లు చెబుతున్నప్పటికీ... పౌరులపై కఠిన ఆంక్షల అమలు పర్యవేక్షణ కోసమే వీటిని ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాబుల్ జనాభా సుమారు 50 లక్షలు. తాలిబన్ పాలన మొదలైన తర్వాత మహిళలు ఉద్యోగాలు చేయడం, వస్త్రధారణ, వినోదం సహా చిన్నారుల విద్యపైనా ఆంక్షలు విధించారు. ఇదే సమయంలో కీలక నగరాల్లో సీసీ కెమెరాలను భారీ సంఖ్యలో ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

మార్గాన్వేషణ ముమ్మరం

మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-హైదరాబాద్: టన్నెల్‌లో నిష్ణాతులతో రెండుమూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తిచేస్తామని, మూడు నెలల్లో సొరంగం పనులు తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హనుమంతరావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కటింగ్ బృందం రాకతో సహాయక చర్యలు వేగవంతం అయ్యాయని వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు మార్గాన్వేషణ ముమ్మరం చేసినట్లు మంత్రి వెల్లడించారు. టన్నెల్‌లో నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తీసివేయడం ద్వారా టీబీఎం ముందుభాగం చెరుకోనున్నట్లు తెలిపారు. దాని చివరి భాగాలను గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నట్లు వివరించారు. ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ర్యాట్ మైనర్స్, రాబిన్సన్ మైనింగ్ ప్రతినిధులు, మెగా, నవయుగ, కంపెనీల బృందాలు నిరంతరం సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సహాయక చర్యలకు ఆటంకంగా మారిన బురద నీటిని తొలగించే ప్రక్రియను వేగవంగతం చేసినట్టు చెప్పారు. మైనింగ్ నిష్ణాతుల సలహాలు సూచనలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సహాయక బృందాలు దృష్టి సారించాయన్నారు. అంతకుముందు విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, నాగర్ కర్నూలు కలెక్టర్ బాధవత్ సంతోష్, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌సీఎండీ ముషారాఫ్ అలీ, దిల్లీ ఆర్మీ అధికారులు కల్నల్ బ్లాక్ స్మిత్ మెహ్రా, జేపీ కంపెనీ ప్రతినిధులు జరుగుతున్న సహాయక చర్యలపై సమీక్షించారు.

విభజన హామీల పరిష్కార బాధ్యత కేంద్రానిదే

- రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యం
- పదేళ్లుగా ప్రాజెక్టులపై దృష్టిపెట్టని బీఆర్ఎస్
- నిధులు తేవాల్సింది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే: పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర విభజన హామీలు నేటికీ నెరవేరలేదని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం కేంద్రానికి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును ఆయన వినియోగించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రధాని మోదీని కలిసి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడారన్నారు. ప్రాజెక్టులపై 10 సంవత్సరాలుగా తమను బీఆర్ఎస్ నేతలు తమను సంప్రదించలేదని బీజేపీ ఆరోపించిందన్నారు. చివరకు ప్రధాని రాష్ట్రానికి వచ్చినా నాటి ముఖ్యమంత్రి కలవలేదన్నారు. కానీ నేడు సీఎంతో సహా మంత్రులు ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామన్నారు. రాష్ట్రానికి ఏ ప్రాజెక్టు రాకపోయినా కిషన్ రెడ్డి బాధ్యులని, ఆయన నిలుపుదల చేస్తున్నట్టు ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. మెట్రో మలిదశ, మూసీ, ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్, హైదరాబాద్ తాగు నీటి సమస్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి

- మిగతా 2 లో

పేదల ఉపాధిపై పిడుగు

- సాంకేతికతతో తీవ్ర ప్రభావం
- పనుల్లేక అల్లాడుతున్న వ్యవసాయ కూలీలు, కార్మికులు
- ఏఐ రూపంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ముప్పు
- బడా పారిశ్రామిక సంస్థలకే ఎక్కువ ప్రయోజనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుందని అందరూ అనుకుంటుంటారు. అది నిజమే. కానీ ఆ సాంకేతిక పరిజ్ఞానం కొందరికి ఉపయోగకరంగా మరి కొందరికి శాపంగా మారింది. ముఖ్యంగా రెక్కాడితే కానీ డొక్కాడని పేదల ఉపాధిపై ప్రభావం చూపుతోంది. ఇక సాంకేతికతను మంచికి ఉపయోగించుకుంటున్నట్లే కొందరు చెడుకు కూడా ఉపయోగించుకుంటున్నారు. అంటే ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు వంటివి ఆ కోవకు వస్తాయి. ఎంతోమంది సైబర్ నేరగాళ్ల బారిన పడి... తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. సాధారణంగా శాస్త్రవేత్తలు చేసే నూతన ఆవిష్కరణలు పది మందికి ఉపయోగపడేలా ఉండాలి. వాటి వల్ల సమాజానికి లాభం చేకూరాలే కానీ నష్టం కల్గించకూడదు. అయితే అవి కొన్ని పెద్ద పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు ఎక్కువ లాభం చేకూర్చేలా వందలాది మంది ఉపాధి కోల్పోయే విధంగా ఉంటున్నాయి. తాజాగా ఇప్పుడు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)పై విస్తృత చర్చ జరుగుతోంది. ఏఐ చాలా ఉపయోగకరమని దీని ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని పాలకులు, మేథావులు పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిందే. కానీ భవిష్యత్తులో ఏఐ ప్రభావం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపై పడుతుందన్న వాదన కూడా వినబడుతోంది. వ్యవసాయ రంగంలో యంత్రాలు రాకముందు వ్యవసాయ కూలీలతోనే రైతులు పనులు చేయించుకునే వారు. దీంతో వ్యవసాయ కూలీలకు వారి గ్రామాల్లోనే ఆయా సీజన్లలో పనులు లభించేవి. ఈ రంగంలో వరి నాట్లు వేసే యంత్రం, వరి కోత యంత్రం, నూర్పిడి, వరిగడ్డిని కట్టలు కట్టే యంత్రం, వేరుశెనగ విత్తనం వేసే యంత్రం, నూర్పిడి యంత్రం, పంట కోత యంత్రం ఇలా వివిధ పంటలకు రకరకాల యంత్ర పరికరాలు రావడంతో వందల మంది కూలీలు పనులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈ ఎనిమిది నెలల్లో ఏం అభివృద్ధి చెందాడబ్బా!?

రాష్ట్రాల పన్ను ఆదాయంలో కోత

- 41 శాతం నుంచి 40 శాతానికి తగ్గించే యోచన
- రూ.35వేల కోట్ల ఆదాయంపై కన్నేసిన కేంద్రం
- ఉచితాలు, రుణమాఫీలకు అడ్డుకట్ట
- ఆర్థిక సంఘానికి సిఫార్సు చేయనున్న కేంద్రం

న్యూదిల్లీ: ఓపక్క పన్ను వాటాలను పెంచాలని రాష్ట్రప్రభుత్వాలు కోరుతుంటే... మరో పక్క కేంద్రంలోని మోదీ సర్కారు రాష్ట్రాలకు చెందాల్సిన పన్ను ఆదాయ వాటాలను తగ్గించాలని చూస్తోంది. సమాఖ్య పన్ను ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వాల వాటాను తగ్గించాలని కేంద్రప్రభుత్వం యోచిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మేరకు కేంద్రంలోని మోదీ సర్కారు ఆర్థిక సంఘానికి సూచించనున్నట్లు తెలిసింది. పన్ను వాటాలపై ఆర్థికవేత్త అరవింద్ పనగారియా నేతృత్వంలోని 16వ ఆర్థికసంఘం 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి అమలు చేయడానికి అక్టోబర్ 31 నాటికి దాని సిఫార్సులను సమర్పిస్తుంది. ఈ క్రమంలో రాష్ట్రాలకు వెళ్లే పన్నుల వాటాను ప్రస్తుత 41% నుండి కనీసం 40%కి తగ్గించాలని ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేయనున్నట్లు తెలిసింది. మార్చి ఆఖరుకు కేంద్ర మంత్రివర్గం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపి, ఆ తర్వాత ఆర్థిక సంఘానికి పంపే అవకాశం ఉంది. రాష్ట్రాల నుంచి వచ్చే పన్ను ఆదాయంలో 1% పెరుగుదల వల్ల ప్రస్తుత సంవత్సరానికి అంచనా వేసిన పన్ను వసూళ్ల ఆధారంగా కేంద్ర ప్రభుత్వానికి దాదాపు రూ.35వేల కోట్ల అదనపు

- మిగతా 2 లో

రేపటి నుంచి ఏపీ ఇంటర్ పరీక్షలు

- 1,535 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 10,58,892 మంది విద్యార్థుల సిద్ధం
- 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఒకటి నుంచి 19 వరకు

- మిగతా 2 లో

తెలుగునాట అ.ర.సం. నిర్మాణం

అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం 1936లోనే ఏర్పడినా తెలుగునాట ఈ సంఘం వ్యవస్థా రూపం ధరించడడం 1943 దాకా ఆగాల్సి వచ్చింది. అయితే తెలుగునాట అ.ర.సం. ఏర్పడడానికి ముందే సామాజిక రంగంలో కందుకూరి వీరేశ లింగం, సాహిత్య రంగంలో గురజాడ అప్పారావు, భాషా రంగంలో గిడుగురామ మూర్తి ఫ్యూడల్ భావజాలాన్ని గట్టిగా వ్యతిరేకించారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

విశాలాంధ్ర శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

నింగిలోకి రెండు చైనా ఉపగ్రహాలు

బీజింగ్: చైనా మరో రెండు ఉపగ్రహాలను ప్రయోగించింది. లాంగ్ మార్చ్ 2సీ క్యారియర్ రాకెట్ ద్వారా గురువారం వాటిని నిర్దేశిత కక్షకు చేర్చింది. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.08గంటలకు ఈ ప్రయోగం జరిగింది. వాయువ్య చైనాలోని జిక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి గోవాజింగ్-1 03, సివే గోవాజింగ్-1 04 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. లాంగ్ మార్చ్ సిరీస్‌లో ఇది 561వ మిషన్ అని వెల్లడించారు.

విభజన హామీల పరిష్కార బాధ్యత కేంద్రానిదే

(మొదటిపేజీ తరువాయి)

అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని పొన్నం వివరించారు. కేంద్రంలో ఉన్న అధికార పార్టీ మంత్రులుగా మీరు రాష్ట్ర ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా నిధులు తేవాల్సిందే అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్... బీజేపీ దిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని ముందు నుంచి తాము చెబుతున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ అన్నారు. కుల సర్వే పై రాజకీయ కారణం చూపిస్తే సరిపోదన్నారు. మాకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని చెప్పారు. తమిళనాడులో రాజకీయ విభేదాలు ఉన్నా... అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరి మాట ఒక్కటే అని, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలన్నారు. కేటీఆర్ మాటలు విని నవ్వుతున్నారని, దిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు, పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఐలమ్మ వర్సిటీని ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి, వర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్, ప్రిన్సిపాల్ లోక పావని పాల్గొన్నారు.

ముగిసిన వంశీ కస్టడీ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం రాబట్టేలా ఆధారాలతో సహా పోలీసులు ప్రశ్నలు అడిగారు. తొలి రోజు రెండున్నర గంటలు, రెండో రోజు ఐదు గంటలు పాటు విచారించారు. విచారణ ముగిసిన అనంతరం వంశీని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. కస్టడీలో వంశీతోపాటు శివరామకృష్ణ, లక్ష్మీపతిని పోలీసులు విచారించారు. విచారణలో తనకేమీ తెలియదని, తనకు సంబంధంలేదని వంశీ పదేపదే బదులిచ్చినట్లు సమాచారం. పోలీసులకు సమగ్రమైన సమాచారం రాకపోవడంతో మరోసారి వంశీని పోలీసులు కస్టడీకి కోరే అవకాశముంది.

తాగునీటికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికబద్ధంగా వాడుకోవాలని కోరింది. ఇకపై పక్షం రోజులకు ఒకసారి తాజా పరిస్థితులను సమీక్షించుకుంటూ సమన్వయంతో ముందుకెళ్లాలని రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచించింది. ప్రస్తుతం సాగర్ నుంచి ఏపీ 7 వేల క్యూసెక్కులు, తెలంగాణ 9 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటున్నట్లు పేర్కొంది. శ్రీశైలం నుంచి 2,200 క్యూసెక్కుల నీటిని ఏపీ తీసుకుంటుంది. శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని తెలంగాణ డ్రా చేసుకుంటున్నట్లు వెల్లడించింది. పంటల సాగు కీలక దశలో ఉన్నందున... అవసరానికి అనుగుణంగా నీరు వృథా కాకుండా వాడుకోవాలని సూచించింది.

రేపటి నుంచి ఏపీ ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రథమ సంవత్సర పరీక్షలను, మూడో తేదీ నుంచి 20 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలను ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా యంత్రాంగం సర్వం సిద్ధమైంది. 26 జిల్లాల్లో 1,535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. 10,58,892 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాలను సీసీ కెమేరాలతో అనుసంధానించి అమరావతి లోని ముఖ్య పరీక్షల నిర్వహణాధికారితో పర్యవేక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలౌతుంది. పరీక్షల సమయంలో జిరాక్స్, నెట్ కేంద్రాలు మూసివేయించ నున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స, విద్యుత్ తదితర కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు చేపట్టారు. హాల్‌టికెట్లను విద్యార్థులే నేరుగా ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభు త్వం కల్పించింది. వాటిపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం ఉండాలన్న నిబంధనను తొలగించింది. పరీక్షల నిర్వహణకు అన్ని జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్...

పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సులను నడపనుంది. ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు 18004 251531కు ఫోన్‌చేసేలా సౌకర్యం కల్పిం చింది. జిల్లా కేంద్రాల్లోను కంట్రోల్ రూమ్ లను సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎల్రక్ట్రానిక్ వస్తువులేవీ అనుమతించబోరు. అత్యవసర సమయాల్లో చికిత్సకోసం 108 అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. ఓపెన్ స్కూల్ సొసైటీకి సంబంధించిన ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి మూడో తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తారు.

నాటోను మర్చిపోండి

ఉక్రెయిన్‌కు ట్రంప్ షాక్

వాషింగ్టన్: నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)లో చేరాలని ఉక్రెయిన్ ఎప్పటి నుంచో కోరుకుంటోంది. ఇందుకోసం ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ అనేకమార్లు అమెరికాను ఆశ్రయించారు. సంప్రదింపులు జరిపారు. రష్యాతో యుద్ధం వేళ నాటో సభ్యత్వాన్ని ఆయన బలంగా కోరుకుంటున్నారు. దీని కోసం అధ్యక్ష పగ్గాలను వదులుకోవడానికి సైతం జెలెన్‌స్కీ సిద్ధపడ్డారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం తన లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ఉక్రెయిన్‌పై అక్కసు ప్రదర్శిస్తున్నారు. అక్కడి ఖనిజ సంపదలు తమకు దారాదత్తం చేసేలా ఆ దేశంపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇదే క్రమంలో నాటో సభ్యత్వం గురించి మర్చిపోండి అని ఉక్రెయిన్‌కు ట్రంప్ షాకిచ్చారు. శ్వేతసౌధంలో కేబినెట్ సభ్యులతో సమావేశానికి ముందు ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. 'నాటో గురించి మీరు మర్చిపోండి. బహుశ ఇదంతా దీని కోసమే మొదలైంది' అని ఉక్రెయిన్‌నుద్దేశించి అన్నారు. రష్యాతో చర్చలలో ఎలాంటి మినహాయింపులు కోరుకుంటారని విలేకరి ప్రశ్నిస్తే ట్రంప్ పై విధంగా స్పందించారు. ఈ యుద్ధంలో భాగంగా రష్యా స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ భూభాగం నుంచి సాధ్యమైనంత ఎక్కువగా ఉక్రెయిన్ తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సహకరిస్తారని ట్రంప్ చెప్పారు. రెండు దేశాలకు సత్ఫలితాలిచ్చేలా ఒప్పందానికి శ్రమిస్తామని... సాధ్యమైనంత ఎక్కువగా ఉక్రెయిన్‌కు తిరిగిచ్చేందుకు ప్రయత్నిస్తామని ట్రంప్ వెల్లడించారు.

90 శాతం యూఎస్ ఎయిడ్ కాంట్రాక్టులు రద్దు

యూఎస్ ఎయిడ్‌పై వివాదానికి తెరతీసిన ట్రంప్ ఇప్పుడు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ సహాయ నిధికి సంబంధించిన 90 శాతం కాంట్రాక్టులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా సహాయ నిధి 60 బిలియన్ డాలర్లను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రపంచ దేశాలకు అమెరికా అందించే అభివృద్ధి, మానవతా సాయాన్ని పూర్తిగా ఆపే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇక యూరోపియన్ యూనియన్‌పైనా సుంకాలు

ఇకపై యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై సుంకాలు విధించబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈయూపై 25శాతం అదనపు సుంకాలు విధిస్తామన్నారు. దీనిని మరింత పెంచే ఆలోచన కూడా ఉన్నదని చెప్పారు. అమెరికాను కట్టడి చేసేందుకూ ఈయూ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఈయూ దిగుమతి చేసుకొంటున్న కార్లపై 10శాతం సుంకం విధిస్తోంది. అలాగే వ్యాట్, ఇతర పన్నులు కలిపి 17.5శాతానికి చేరుతోంది. అమెరికా 2.5శాతం మాత్రమే వసూలు చేస్తోంది.

ట్రంప్ నిర్ణయం సరికాదు: ఈయూ

ట్రంప్ తాజా ప్రకటనను ఈయూ తీవ్రంగా ఖండించింది. యూరోపియన్ యూనియన్‌ది ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అని, దీనిని అమెరికా ఓ వరంగా చూడాలని, సుంకాలు విధిస్తామంటూ ప్రకటించడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. 'స్వచ్ఛ, పారదర్శక వాణిజ్యానికి ఆటంకం కలిగించడమే కాకుండా చట్టాలను, వివక్షరహిత విధానాలను సవాలు చేసేవిగా ట్రంప్ నిర్ణయాలు ఉన్నాయని దుయ్యబట్టింది.

గాజాను పాలించబోం

ఇజ్రాయిల్ ప్రతిపాదనకు ఈజిప్టు తిరస్కృతి



కైరో: గాజా స్ట్రిప్‌ను తాత్కాలికంగా పరిపాలించాలని ఇజ్రాయిల్ ప్రతిపాదించడాన్ని ఈజిప్టు తిరస్కరించింది. తాము గాజా పగ్గాలు చేపట్టబోమని తేల్చిచెప్పింది. ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య ఘర్షణకు శాశ్వత పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. ఈజిప్టు, అరబ్ స్థానాలను అధిగమించేలా ఉన్న ఏ ప్రతిపాదననూ ఆమోదించబోమని స్పష్టంచేసింది. ఈ మేరకు ఈజిప్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తమీమ్ ఖలాఫ్ వెల్లడించినట్లు అధికారిక వార్తా సంస్థ మిడిల్‌ఈస్ట్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. ఈ సమస్యకు సమగ్ర-శాశ్వత పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, సగం-సగం పరిష్కారాలను ఒప్పుకోబోమని, ఇలాంటి ప్రతిపాదనలను తిరస్కరిస్తామని ఖలావ్ చెప్పినట్లు వార్తా నివేదిక పేర్కొంది. పలస్తీనా భూభాగాల మధ్య విడదీయలేని స్వభావం ఉండటాన్ని ఆయన వక్కాణించినట్లు తెలిపింది. గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్‌తో పాటు తూర్పు జెరూసలేం మధ్య అనుసంధానం ఉండటాన్ని ఖలాఫ్ నొక్కిచెప్పారు. ఇవి భావి పలస్తీనా దేశ భూభాగాలు... పలస్తీనా స్వయంప్రతిపత్తికి సంబంధించినవన్నారు. కాగా, ఈజిప్టు విదేశీ అప్పు ప్రోత్సాహకంగా ఇంటర్నేషనల్ కమ్యూనిటీ సెటిల్‌మెంట్‌తో గాజాను ఈజిప్టు కనీసం ఎనిమిదేళ్లు పాలించేలా ఇజ్రాయిల్ విపక్ష నేత యైర్ లాపిడ్ మంగళవారం ప్రతిపాదించారు.

ఎస్ఎల్‌బీసీపై ప్రభుత్వానిది మొద్దు నిద్ర

- 8 మంది ప్రాణాలు కాపాడడంలో చేసింది శూన్యం
- రేవంత్‌కు ఎన్నికల ప్రచారంపై ఉన్న శ్రద్ధ టన్నెల్‌పై లేదు: హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాటంలో ప్రభుత్వం చేసింది సున్నా పనేనని, గమనిస్తే ఎంత మొద్దునిద్రలో ఉందనే విషయం స్పష్టం అవుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఆరు రోజులు గడుస్తున్నా కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు కనీసం తట్టెడు మట్టి కూడా తీయకపోవడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీకు వెళ్లిన బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు ఐదు కిలోమీటర్ల ముందే అడ్డగించారు. దీంతో ఆయనతో కలిసి మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వివిధ సహాయక బృందాల మధ్య సమన్వయం చేయ డంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మంత్రులు పొద్దున వస్తున్నారు... సాయంత్రం పోతున్నారు... ఇదేమైనా టూరిస్ట్ ప్రాంతమా... హెలికాప్టర్లు వేసుకొని మరీ తిరుగుతున్నారని మండిపడ్డారు. కన్వేయర్ బెల్టు రిపేర్ చేయడానికి ఆరు రోజులు పడుతుందా ఇది గంటల్లో పూర్తి చేసే పని అని అన్నారు. వేగంగా డీ వాటరింగ్ చేసి, కన్వేయర్ బెల్ట్ ఓకే చేసి దాని ద్వారా అడ్డంకిగా ఉన్నవి బయటికి తెచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. బాధ్యతగల ప్రజాప్రతినిధుల మైన తాము వస్తే అడ్డుకుంటారా అని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల టన్నెల్ కూలిందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ఘటనలకు ఏం సంబంధమని నిలదీశారు. పని ప్రారంభంలో జియాలజికల్ సర్వే రిపోర్ట్ బయట పెట్టాలన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్స్ మెకానిక్ సంస్థ అభిప్రాయం... ఉంటే ఆ రిపోర్టు బయట పెట్టండని అన్నారు. అంతకుముందు తొమ్మిదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎస్ఎల్‌బీసీలో రూ.3,300 కోట్ల పని జరిగితే, తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,900 కోట్ల పని జరిగిందని వివరించారు. రెండేళ్లు కరోనా వచ్చినా దాదాపు 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పూర్తి చేసామన్నారు. దిండి, పెళ్లిపాక రిజర్వాయర్‌లను 90శాతం పూర్తి చేసామన్నారు. రేవంత్ రెడ్డికి ఇక్కడికి వచ్చి చూసే టైం లేదు కానీ... ఢిల్లీకో, కరీంనగర్‌కో వెళ్లి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. సీఎంకు ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా, ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో ఖమ్మం జిల్లాలో పెద్దవాగు కొట్టుకుపోయింది, సుంకిశాల కుప్ప కూలింది, పాలమూరు ... వట్టెం పంప్ హౌస్ జలమయమైంది, నేడు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిందన్నారు.

తెలంగాణ అభివృద్ధి ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్‌కు హబ్‌గా తెలంగాణ మారబోతోందని ఉద్ఘాటించారు. రేవంత్ రెడ్డి గురు వారం మాదాపూర్‌లోని హెచ్‌సీఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ప్రారంభిం చారు. బహుళజాతి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం, కొత్త సౌకర్యాలను ప్రారంభించడం వంటివి నిత్యకృత్యంగా మారిందని, ఇది హర్షణీయమని సీఎం అన్నారు. తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. ఏడాదిలో దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని మరోమారు సంకల్పిం చారు. దావోస్‌కు రెండు సార్లు వెళ్లిన క్రమంలో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలపై సంతకాలు చేసుకున్నామని చెప్పారు. గతంలో తన లక్ష్యాలను అసాధ్యమన్న అన్న వారంతా అవి సుసాధ్యమని నమ్మేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్ అన్నారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను కొద్దిరోజుల క్రితం ప్రారంభించు కున్నాం. గ్లోబల్ కంపెనీ హెచ్ సీఎల్ టెక్ శాఖ ప్రారంభించడం గర్వ కారణం. ఇది 60 దేశాలలో పనిచేస్తోంది. ఈ సంస్థలో 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు' అని రేవంత్ అన్నారు. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో ప్రపంచ స్థాయి అవకాశాలు సృష్టిస్తు న్నారని, హెచ్‌సీఎల్ అంచెలంచెలుగా నేడున్న స్థాయికి ఎదిగిందన్నారు. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు వేల మందితో కేఆర్‌సీలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో హెచ్‌సీఎల్ టెక్ హైదరాబాద్‌లో గొప్పగా పనిచేస్తున్నదని రేవంత్ కొనియాడారు.

ఎమ్మార్ వివాదాలు పరిశీలించాలి

ఎమ్మార్ వివాదాల క్రమంలో సంబంధిత ఒప్పందాల పత్రాలు, కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. వివిధ దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసులు, దాఖలు చేసిన ఛార్జీ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ఈ వ్యవహారం ముడిపడి ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. వివిధ కేసులతో పెండింగ్ ఉన్న తమ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్ ప్రాపర్టీస్ ఆశ్రయించింది. సచివాల యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో ఎమ్మార్ ప్రతినిధులు సమావేశమయ్యారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్... హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో జరిగినవి అక్రమ ఒప్పందాలంటూ అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. దీంతో దర్యాప్తులు, కోర్టు విచారణలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో ఐదుగురు కార్యదర్శుల కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ కూడా దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారు. సీఎంతో తాజా భేటీ క్రమంలో ఈ వివరాలన్నింటిని ఎమ్మార్ ప్రతినిధులు నివేదించారు. వివాదాల అధ్యయనానికి, సామరస్య పూర్వక పరిష్కారం కోసం యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా రేవంత్ రెడ్డి అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ సంప్రదింపులు జరిపిన తదుపరి సూచనలు, సలహాలిస్తుందని చెప్పారు. 2015లో ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని రేవంత్ ఆదేశించారు.

టెక్నాలజీ... రెండు వైపులా పదునున్న కత్తి

- బాధ్యతాయుతంగా ఉపయోగించకుంటే భారీ విధ్వంసం
- సాంకేతిక అక్షరాస్యతతోనే సమాన అవకాశాలు
- సైబర్ నేరాలను కాలర్ ట్యూన్‌తో ఆపలేం
- ఎంటర్‌ప్రెన్యూర్ టెక్ - ఇన్నోవేషన్ సమిట్‌లో కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానంలో నూతన ఆవిష్కరణలు రావాలని, సాంకేతికత అభివృద్ధి చెందాలని, కానీ అది సమాజానికి మేలు చేసేదిలా ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బెంగుళూరులో గురువారం జరిగిన 'ఎంట్రప్రెన్యూర్ టెక్ అండ్ ఇన్నోవేషన్ సమిట్ - 2025' లో 'డ్రైవింగ్ డిజిటల్ ఇండియా 9 టెక్నాలజీ అభివృద్ధికి మార్గదర్శకతలు- ఆవిష్కరణలు' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. టెక్ లీడర్స్, పాలసీ మేకర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులతో కేటీఆర్ మాట్లాడారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కానీ ప్రతి సాంకేతిక ఆవిష్కరణ వెనుక మానవ అవసరాలు, నైతిక విలువలు నిలకడగా ఉండాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ బాడీస్ వంటి సాంకేతిక పరిణామాలు ఎలా ప్రపంచాన్ని మార్చగలవో వివరించారు. సాంకేతికతను బాధ్యతగా ఉపయోగించకపోతే అది ప్రమాదకరమవుతుందని కేటీఆర్ హెచ్చరించారు. భవిష్యత్తు నిర్మాణం అంటే కేవలం రేపటి రోజుల్లో జీవించడం కాదు అని, రేపటిని నిర్మించడం అని అన్నారు. ఇదే స్ఫూర్తితో సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని టెక్నాలజీ అభివృద్ధి జరగాలన్న ఆవశ్యకతను నొక్కి చెప్పారు. డ్రోన్స్ వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చగలవని ప్రశంసించిన ఆయన, అదే డ్రోన్స్ విధ్వంసానికి ఉపయోగిస్తే అది ప్రమాదకరం అని హెచ్చరించారు. అందుకే ప్రతి టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని స్పష్టం చేశారు. ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంతో పెనవేసుకుంటున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, టెక్నాలజీ సామర్థ్యం అధికంగా ఉన్న యువత సైబర్ నేరాలకు ఎందుకు పాల్పడుతున్నారో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాల పై కేవలం ఒక కాలర్ ట్యూన్ పెట్టి ఆపలేమని కేంద్ర ప్రభుత్వానికి చురకలు అంటించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుష్పరిణామాలను ఆపడం ప్రభుత్వ పెద్దలకు సవాలుగా మారింది అన్నారు. సాంకేతిక అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ అంశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. టెక్నాలజీ నిరక్షరాస్యత ఉన్న జనాభాకి ఏ విధంగా సహాయం చేయాలో ఆలోచించాలని అన్నారు. డిజిటల్ విభజన పెరుగుతున్నకొద్దీ సమాజంలో మరింత విభజన వస్తుందని, టెక్నాలజీ అందరికీ సమానంగా అందినప్పుడే సమాన అవకాశాలు ఏర్పడతాయన్నారు.

'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై రేవంత్‌వి అడ్డగోలు వ్యాఖ్యలు'

ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు ఉంది సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం అని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అన్నారు. దిల్లీలో రేవంత్ చిట్ చాట్ పేరిట చేసిన చిల్లర వ్యాఖ్యలపై ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సీఎం చేసిన అడ్డగోలు ప్రకటనపై మండిపడ్డారు. తన అసమర్థతను పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం పైన నెపం నెడుతున్నారని విమర్శించారు. జీఎస్ఐ, ఇంజినీరింగ్ నిపుణుల సంస్థలతో సంప్రదించకుండానే ఆగిపోయిన ప్రాజెక్టుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాత యంత్రాలతో ప్రారంభించారని ఆరోపించారు. కేవలం రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ఈరోజు 8 మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని ధ్వజమెత్తారు. దీనికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదే అని స్పష్టం చేశారు. కార్మికులను రక్షించాల్సింది పోయి అవమానకర ఆట ప్రారంభించారని మండిపడ్డారు. చీఫ్ మినిస్టర్‌గా మాట్లాడాలి కానీ ... చీప్ మినిస్టర్‌గా మాట్లాడవద్దని హితవు పలికారు. హామీలను అమలు చేయడం చేతకాకనే ప్రజల టెన్షన్ డైవర్షన్ కోసం ముఖ్యమంత్రి ఇవన్నీ మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర అప్పులపై రేవంత్ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. రూ.6,500 కోట్లు కేవలం వడ్డీకే అయిపోతుందంటూ ప్రజలను, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదల ఉపాధిపై పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయే పరిస్థితి వచ్చింది. వందల మంది కూలీలు చేసే పని ఒక్క మిషన్‌తో తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో రైతులు నిర్వహించుకునే పరిస్థితులు వచ్చాయి. దీంతో వ్యవ సాయ కూలీలు పనుల కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు దాపు రించాయి. వాస్తవానికి వ్యవసాయ యాంత్రీకరణ ఒకరకంగా రైతులకు ఉపయోగకరమే. అయితే కూలీల ఉపాధి దెబ్బతీయడానికి ఆస్కారం అయింది. దీంతో వ్యవసాయ పనులకు కూలీలు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతు న్నాయి. ఇక ఇసుక క్వారీల్లో పొక్లెయిన్లు వాడుతుండటంతో అక్కడ పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయారు. అలానే టోల్‌ప్లాజాల్లో ఇంతకు ముందు సిబ్బంది వాహనదారుల నుండి నగదు వసూలు చేసి రసీదులు ఇచ్చేవారు. ఇందులో ఫాస్ట్‌ట్యాగ్ విధానం రావడంతో టోల్ ప్లాజాల్లో పని చేసే సిబ్బంది సంఖ్య తగ్గిపోయారు. ఇక త్వరలో రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు రానున్నాయి. అవి ఏర్పాటయితే ఇప్పటివరకు నెలనెలా మీటర్లలో కరెంటు రీడింగ్ తీసుకునే వారు రోడ్డున పడతారు. దాదాపు రెండు దశాబ్దాలుగా చాలీ చాలని వేతనాలతో ఎప్పటికైనా సంస్థలోకి తీసుకుంటారన్న ఆశాభావంతో పని చేస్తూ వచ్చిన మీటరు రీడర్లు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి దాపురించింది. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వీరి ఆందోళనకు రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. కొత్త సాంకేతికతకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉన్న స్మార్ట్ మీటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవి ఏర్పాటు చేస్తే విద్యుత్ వినియోగానికి సంబంధించి సిబ్బంది ప్రతి నెలా వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు ? ఎంత బిల్లు చెల్లించాలి ? అన్న వివరాలు సంబంధిత వినియోగదారుని మొబైల్ ఫోన్‌కు మెసేజ్ ద్వారా తెలియజేస్తారు. గడువులోగా బిల్లు చెల్లించకపోతే మానిటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్ మీటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసే అవకాశం ఉంటుంది. లైన్‌మెన్ ఇళ్లకు వచ్చి ఫ్యూజులు తీసుకెళ్లాల్సిన పని ఉండదు. ప్రజల ఆందోళనల నేపథ్యంలో ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తాత్కాలికంగా వాయిదా పడినా... రాబోయే రోజుల్లో వీటిని ఉపయోగించే అవకాశం ఉంది. శాస్త్రవేత్తలు తమ మేథా శక్తితో నూతన ఆవిష్కరణలు చేసినప్పుడు వాటి వల్ల ఉపయోగాలతో పాటు ప్రభావం పడే రంగాలపైనా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంటుంది. కొత్త టెక్నాలజీ ఏర్పాటుతో నష్టపోయే వారికి ప్రత్యామ్నాయ ఉపాది అవకాశాలు కూడా చూపాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రాల పన్ను ఆదాయంలో కోత

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం రావచ్చు. వ్యక్తిగత వార్షికాదాయ పన్ను వసూళ్ల ఆధారంగా తుది సంఖ్య మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు వెళ్లే పన్నుల వాటా 1980లో 20% నుండి ఇప్పుడు 41%కి పెరిగింది. కానీ కేంద్ర ప్రభుత్వానికి ఖర్చులు భారీగా పెరిగాయని... ముఖ్యంగా ఆర్థిక మాంద్యం నెలకొన్న కాలంలో ఇది ఎక్కువగా ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనివల్ల రాష్ట్రాలకు వెళ్లే పన్ను ఆదాయంలో వాటా కోసం డిమాండ్లు వస్తున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. 2024-25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.8%గా అంచనా వేయబడింది. అయితే రాష్ట్రాలు జాతీయ జీడీపీలో 3.2% ద్రవ్య లోటును కలిగి ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలో మొత్తం ప్రభుత్వ వ్యయంలో రాష్ట్రాలు 60% కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. సాధారణంగా ఆరోగ్యం, విద్య వంటి సామాజిక మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చు చేస్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వ్యయం భౌతిక మౌలిక సదుపాయాలపై ఎక్కువగా ఉంటుంది. అయితే, జులై 2017లో జీఎస్టీ అమలు చేసినప్పటి నుండి రాష్ట్రాలకు ఆదాయాన్ని పెంచడం పరిమితంగానే ఉంది. కోవిడ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో పంచుకోని సెస్‌లు, సర్‌చార్జీల ఆదాయ వాటాను మొత్తం పన్ను ఆదాయంలో అంతకుముందున్న 9%-12% నుండి 15% కంటే ఎక్కువకు పెంచింది. ఇక రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు నగదు విరాళాలు, రుణ మాఫీలు, ఇతర ఉచితాలను ఇవ్వకుండా నిరుత్సాహపరిచే మార్గాలను కూడా కేంద్ర ప్రభుత్వం సూచించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఉదాహరణకు కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్ల కోసం కొన్ని షరతులను విధించడం. ఆ షరతులను నెరవేర్చిన తర్వాతే రాష్ట్రాలు అటువంటి గ్రాంట్లకు అర్హులు అవుతాయని ఆ వర్గాలు తెలిపాయి. ఉచిత పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం గ్రాంట్లను నిరాకరిస్తుందో లేదో స్పష్టత లేదు. గత ఐదేళ్లలో ఈ ఆదాయ లోటు గ్రాంట్లు 2021/22లో 1.18 ట్రిలియన్ రూపాయల నుండి 2025-26 బడ్జెట్‌లో అంచనా వేయబడిన 137 బిలియన్ రూపాయలకు తగ్గాయి.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మహిళలకు తమ చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని అప్పుడే ఎదురయ్యే సమస్యలను అధిగమి స్తారని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి భానుమతి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు క్షమించరాని నేరమన్నారు. గురువారం ఐడిఓసి కార్యాల యం సమావేశ మందిరంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో భానుమతి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై సాహెహొద్యోగు లు లైంగిక వేధింపులకు గురి చేస్తే మహిళా చట్టాలను ఉపయోగించి ఫిర్యాదు చెయ్యాలని సూచించారు. న్యాయమూర్తి భానుమతి మాట్లాడుతూ లైగింక వేధింపుల నివారణకు మార్గదర్శకాలను భారత సుప్రీం కోర్టు వివరంగా జారీచేసిందని ఆమె గుర్తు చేశారు. స్థానిక సంస్థల కలెక్టర్ విద్యా చందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎస్బిఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరకొద్దు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : పోడు వ్యవసాయం కోసం అడవిలో చెట్లను నరకొద్దని దట్టమైన అడవిలో సౌకర్యాల లేని చోట ఉండే కంటే రహదారి సౌకర్యం ఉన్న ప్రాంతానికి రావాలని గుత్తి కోయలను జిల్లా కలెక్టర్ కోరారు. లక్ష్మీదేవి పల్లి మండలం పునుకోడు చెలక గ్రామపంచాయతీ పరిధిలోని చింతల మేది, మద్ది గుంపు గుత్తి కోయ ఆవాసాలను గురువారం సందర్శించారు. రహ దారి సౌకర్యం సరిగా లేని కాలిబాటలా ఉన్న అడవి ప్రాంతంలో కలెక్టర్ మోటార్ సైకిల్‌పై ప్రయాణించి గుత్తి కోయిల గ్రామాలను చేరుకున్నారు. ప్రత్యక్షంగా వారి జీవనస్థితిగతులను, ఆయా కుటుంబాలకు అందుతున్న మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తో కలసి వెళ్లారు. గుత్తి కోయిల అభివృద్ధి కొరకు నిత్యం కృషి చేస్తున్నామని, విద్య, వైద్య, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామనీ హామీ ఇచ్చారు. గ్రామంలో త్రాగునీరు కోసం సంపు నిర్మాణం చేపట్టాలని మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో చలపతిరావు, మిషన్ భగీరథ డిఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

మరిపెడలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

విశాలాంధ్ర-మరిపెడ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన 49వ బూత్ లో పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 91 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 90 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 64 మంది పురుష ఉపాధ్యాయులు, 26మంది మహిళా ఓటర్లు ఓటు వేశారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగియగా 99శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారు లు వెల్లడించారు. కాగా మధ్యాహ్నం తొర్రూర్ డిఎస్పీ కృష్ణ కిషోర్ పోలింగ్ బూత్ సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మరిపెడలో ప్రిసైడింగ్ ఆఫీసర్ తొర్రూర్ డీటీ నర్సయ్య విధులు నిర్వహించగా, డీఎస్ఓ ప్రేమ్ కుమార్ నేతృత్వంలో పోలింగ్ ఏర్పాటు చేశారు. వారి వెంట మరిపెడ ఆర్ఐ శరత్ కుమార్ ఉన్నారు. మరిపెడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరిపెడ వైద్యాధికారి డాక్టర్ రవి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సిరి, ఏఎన్ఎం ఝాన్సీ, ఆశ ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ వింత ధోరణి....

విశాలాంధ్ర - బ్యూరో ఖమ్మం : టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఖమ్మంలో పోలింగ్ కేంద్రాల సమీపంలో బిజెపి కార్యకర్తలు మోడీ బొమ్మలతో ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఇది ఎన్నికల నియమావళికి పూర్తి విరుద్ధం. వీరు ఎన్నికల నియమావళిని ఎంత మాత్రం పాటించకుండా బహిరంగంగా ప్రధాని మోడీ బొమ్మలతో ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శించడంతో ఖమ్మంలో కొంతసేపు గందరగోళ్ల పరిస్థితి ఏర్పడింది. మిగిలిన పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల మద్దతుదారులు బిజెపి వారు వ్యవహరిం చిన తీరుపై తీవ్ర నిరసనను ఆందోళనను వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంలో పాటించాల్సిన నియమాలను వారు బహిరంగంగా ఉల్లంఘిం చడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరిగింది. ఏ ఎన్నికలు వచ్చినా బిజెపి తీరు మారదా అంటూ నగరంలో ప్రజలు చర్చించుకున్నారు. ఇతర ఉపాధ్యాయ సంఘాలకు చెందిన పలువురు ఆందోళన చేయడంతో అధికారులు ఆయా ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటికీ ఈ ఫ్లెక్సీల వల్ల కొంత గందరగోళ్ల పరిస్థితి కొద్దిసేపు ఏర్పడింది.

క్షతగాత్రుని పరామర్శించిన బీఆర్ఎస్ నేత

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : గత పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ, ములుగుజిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన పండుగ సునీల్‌ను క్షతగాత్రుని బీఆర్ఎస్ ములుగుజిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు పరామర్శించారు. పండుగ సునీల్ తలకు తీవ్రమైన గాయం కావడంతో హైదరాబాదులోనూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు, మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. యువత హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని కోరారు. రాత్రి వేళలో జాగ్రత్తలు పాటిస్తూ, ప్రయాణాలు చేయాలని కోరారు. తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చవద్దని కోరారు. ఆయన వెంట ప్రదీప్ బాబు ఉన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ శాతం వివరాలను కంట్రోల్ రూమ్ నకు అందజేయాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని కోరారు. అనంతరం కడెం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు అందజేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్లు, సాయంత్రం 4 గంటల వరకు 93.05 శాతం పోలింగ్ నమోదు అయిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్‌లో ఉన్న టీచర్స్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ శాసన మండలిలో టీచర్స్ స్థానాల ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ కేంద్రాలలో టీచర్స్ తమ ఓటు హక్కును వినియో గించుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 4089 మంది టీచర్ ఓటర్స్ ఉన్నారని, సాయంత్రం 4.00 గంటల వరకు టీచర్స్ ఎన్నికలలో 3805 మంది ఓటు వేయగా, అందులో 2218 మంది పురుష ఓటర్లు, 1587 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత నల్గొండలో ఉన్న రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లను తరలించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ అన్నారు.

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్‌లో: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు జరగలేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 23 కేంద్రాలలో ఎన్నికల పోలింగ్ చేపట్టామని, మొత్తం 2022 మంది ఓటర్లకు గాను 1859 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని ఆయన తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 973 ఉండగా మహిళా ఓటర్లు 886 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో మొత్తం పోలింగ్ 91.94 శాతంగా నమోదయిందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య బ్యాలెట్ బాక్స్‌లను నల్గొండ రిసెప్షన్ సెంటర్‌కి తరలించడం జరిగిందన్నారు.

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరోలో : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన త్రాగునీరు ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సరళిపై ప్రిసైడింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసినందున సిబ్బంది బ్యాలెట్ బాక్స్ సీలు వేయు విధానాన్ని పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం నిర్దేశించిన రూట్ మ్యాప్ ద్వారా నల్గొండ రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్స్‌లను తీసుకువెళ్లాలని సూచించారు.

పార్టీ మార్పు వార్తలు అవాస్తవం

విశాలాంధ్ర - తొర్రూరు: పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారాలు అవాస్తవమని, కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని డిసిసిబి డైరెక్టర్, తొర్రూరు పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ సహాయం కృష్ణ కిషోర్ రెడ్డిలు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమపై పార్టీ మారుతున్నట్లు వచ్చిన వార్తలు వాస్తవం కాదని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మా కుటుంబంలో శుభకార్యాలు, సొంత పనులు ఉండడంవల్ల పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలను కొన్ని రోజులు కలవకపోవడంతో కొంతమంది తమపై దుష్ప్రచారాలు చేశారని అన్నారు. మాజీ మంత్రి దయాకర్ రావు ఓ పెళ్లి ఫంక్షన్ లో కలిసి మాట్లాడితే పార్టీ మారుతున్నట్లు ప్రచారాలు చేశారని అన్నారు. ఇప్పటికైనా తమపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, ఎర్రబెల్లి రాఘవరావు, చాపల బాపురెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కంచర్ల వెంకటాచారి, నాయకులు గంజి దేవేందర్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, మెరుగు మల్లేశం గౌడ్, శ్రీనివాస్ చారి, అరవింద్, వెంకన్న యాదవ్, బంగారు శంకర్, మహేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం 300 మంది నిరుద్యోగ యువతకు కస్టమర్ సర్వీస్ రంగాలలో ఇంటర్న్ షిప్ శిక్షణను ఇవ్వనున్నట్లు హైదరాబాద్ కు చెందిన హెచ్ ఆర్ హెచ్ నెక్స్ సర్వీస్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ హ్యూమన్ రిసోర్స్ హెడ్ వై. ప్రియా మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్ హెచ్ నెక్స్ సర్వీసెస్ కంపెనీ ఇదివరకే వరంగల్, నిజామాబాద్, తుంకూర్, బెంగళూర్, కోయంబత్తూర్ పాలక్కాడ్ తదితర ప్రాంతాలలో సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. 45 రోజుల పాటు ఇచ్చే కస్టమర్ సర్వీస్ ఇంటర్న్ షిప్ ట్రైనింగ్‌కు 18 సంవత్సరాలు పైబడిన, ఇంటర్మీడియట్ విద్యార్హత ఉండి, హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలు వచ్చి ఉన్న వారు అర్హులని తెలిపారు. మార్చి 1 నుండి ఏప్రిల్ 10 వరకు ఉంటుందని, శిక్షణా కాలం మొత్తానికి 11,500 రూపాయలు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని, అంతేగాక కోర్స్ అనంతరం సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 50 మందికి హెచ్ఆర్ హెచ్ కంపెనీలోనే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌లో ఇవ్వనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటిడిఏ పిఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిణి చిత్ర మిశ్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్, ఆయన బృందంతో కలిసి ములుగు మండలం జగ్గన్నపేటలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల హాస్టల్ ను సందర్శించి అవసరమైన మరమ్మతులు పరిశీలించారు. పిఓ మాట్లాడుతూ కిచెన్, డైనింగ్ ఏరియాను పరిశీలించి, రెండు ప్రాంతాలలో ఫ్లోరింగ్ మరమ్మతు పనులు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఆవరణను శుభ్రంగా ఉంచాలని హెడ్ మాస్టర్/వార్డెన్‌లను ఆదేశించారు. ప్రతిసారీ విద్యార్థులకు వేడిగా వండిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. టాయిలెట్ బ్లాకులను పరిశీలించి, పని నాణ్యత, పెయింటింగ్‌తో అదనపు టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. డార్మిటరీ భవనాన్ని పరిశీలించి, కిటికీలకు మెష్‌ను అమర్చాలని, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్‌ల మరమ్మత్తులు, పెయింటింగ్‌లో ఏవైనా ఉంటే వాటిని పరిష్కరించాలని ఇంజనీర్లను ఆదేశించారు. జిసిసి ఆహార పదార్థాల సరఫరా, ఆహార పదార్థాల సరైన నిల్వ, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ వార్డెన్‌తో విచారించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్ డి.వీరభద్రం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంత్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మణ్, టెక్నికల్ ఆఫీసర్ సురేష్, సంబంధిత హెడ్ మాస్టర్/ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

37శాతం మంది మహిళలే ఇంటి ఆదాయ సంపాదకులు: గోడాడీ సర్వే

న్యూఢిల్లీ: భారతీయ మహిళా వ్యవస్థాపకులు కుటుంబాలను ఆర్థికంగా నడిపిస్తున్నారు. వారి చిన్న వ్యాపారాలకు శక్తినిచ్చేందుకు కృత్రిమ మేధస్సు స్వీకరణకు నాయకత్వం వహిస్తున్నారు. గోడాడీ 2025 గ్లోబల్ ఎంటర్ప్రెన్యూర్‌షిప్ సర్వే ఈ మహిళలు నమ్మకంగా, స్థిరత్వంతో విజయాన్ని పునర్నిర్వచించుకుంటున్నారని, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, వ్యాపార అవకాశాలు, ఆవిష్కరణల కొత్త శకానికి ప్రేరణనిచ్చేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నారని వెల్లడించింది. భారతదేశంలో, సర్వే చేయబడిన చిన్న వ్యాపారాలలో పావు వంతు (27%) కంటే ఎక్కువ మంది మహిళల యాజమాన్యంలో ఉన్నాయి, వీటిలో 74% గత ఐదు సంవత్సరాలలో తమ వ్యాపారాన్ని ప్రారంభించినట్లు నివేదించాయి.

డిఐవై హెయిర్ మాస్క్‌తో వేడిని అధిగమించవచ్చు

విశాఖపట్నం: డి ఐ వై హెయిర్ మాస్క్‌తో మృదువైన, పోషకమైన జుట్టు సొంతం చేసుకోవడంతోపాటు వేడిని అధిగమించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వేసవికాలం సమీపిస్తుందని ఇది మీ జుట్టును తేమను తీసివేస్తుం దన్నారు. ఈ సీజన్లో మీ జుట్టును ఆరోగ్యంగా హైడ్రేట్ గా ఉంచడానికి సరైన పదార్థాలతో దానిని పోషించడం చాలా అవసరమన్నారు. సులువైన ఇంకా ప్రభావవంతమైన మార్గం కోసం పారాచూట్ అడ్వాన్స్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కొబ్బరి నూనె వన్-స్టాప్ పరిష్కారంగా ఉంటుందన్నారు. అలోవెరా, కొబ్బరి యొక్క మంచితనంతో సమృద్ధిగా ఉన్న ఈ తేలికపాటి, జిగట లేని ఫార్ములా గొప్ప పోషణను అందిస్తుందన్నారు. ఎటువంటి అదనపు తయారీ అవసరం లేకుండా, వేసవిలో మీ జుట్టును 2 రెట్లు సున్నితంగా మృదువుగా చేస్తుందన్నారు. డిఐవై నరిషింగ్ హెయిర్ మాస్క్‌ను ఇష్టపడేవారికి, మృదువైన పేస్ట్‌లా తయారుచేయడానికి కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్‌తో తాజా అలోవెరా జెల్‌ను కలపాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 23 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకొన్నారు. జిల్లాలో మొత్తం 2022 మంది ఓటర్లు వున్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం కొన్ని కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. సింగరేణి కాలరీస్ బాలికల ఉన్నత పాఠశాల, పాల్వంచ బొల్లోరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

విశాలాంధ్ర - కొత్తగూడెం : మార్చ్ 8న సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో అం తర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించెందుకు ఏర్పాట్ల ప్రణాళికలను సంస్థ సిద్ధం చేస్తుంద ని జిఎం (పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు అన్నారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని వెల్ఫేర్ ఛాంబర్ లో మహిళా ఉద్యోగులతో, సింగరేణి సేవా సెక్రటరీలతో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్పొరేట్ ఏరియా మహిళా ఉద్యోగులకు హెడ్డాఫీస్‌లో వివిధ క్రీడా పోటీలు, సంకృతిక కార్యక్రమాలు నిర్వహించి 8న విజేతలకు బహుమతు లందజేస్తామన్నారు. సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులకు 10న కేసిఓఏ క్లబ్‌లో ఆటల, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తామని తెలిపారు. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఎలాంటి లోటు లేకుం డా ఏర్పాట్లను ఉండాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిఎం కవితానాయుడుతో పాటు డిజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, మేనేజ్మెంట్ ట్రైనీ ఉదయ్ కుమార్, మహిళా ఉద్యోగులు, వెల్ఫేర్ పిఏ వరప్రసాద్, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసి ఫాస్నేట్, సేవా సెక్రటరీ సుజాత సేవా కొ-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మార్చి నాటికి 4000 ఉద్యోగులను నియమిస్తున్న ఎస్ఐఎల్ఏ

ముంబై: రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫారమ్ అయిన ఎస్ఐఎల్ఏ, దేశవ్యా ప్తంగా 50పైగా కొత్త క్లయింట్లు పొందడం ద్వారా కొత్త సంవత్సరాన్ని విజయవంతంగా ప్రారంభించింది. ఈ విస్తరణకు అనుగుణంగా, ఎస్ఐఎల్ఏ ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో మార్చి 2025 నాటికి 4,000కుపైగా ఉద్యోగాలు అందిస్తోంది. జేఎస్‌డబ్ల్యు స్టీల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, ఫాక్స్‌కాన్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ సర్వీసెస్, జేఎం ఫైనాన్స్, డీఎల్ఎఫ్, పిరామిల్, హెూండా, టీవీఎస్, బ్రిగేడ్-వరల్డ్ ట్రేడ్ సెంటర్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వంటి సంస్థలు కొత్త క్లయింట్లుగా చేరాయి. ఎస్ఐఎల్ఏ డైరెక్టర్ రాఘవ్ కపూర్ మాట్లాడుతూ, "గత 45 రోజుల్లో అనేక కంపెనీలు మా సేవలపై నమ్మకం ఉంచాయని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200 మిలియన్ చదరపు అడుగుల ఆస్తిని నిర్వహిస్తుందన్నారు.

వ్యాపారుల్లో 98% మంది ఏఐ స్వీకరణ: లింక్డ్‌ఇన్

ముంబయి: రెండు సంవత్సరాల తర్వాత, ఉత్పాదక ఏఐ ఒక సాధారణ పదం నుండి వ్యాపారానికి తప్పనిసరి అవసరంగా పరిణామం చెందింది. భారతదేశం అంతటా నాయకులు దాని సామర్థ్యాన్ని స్వీకరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్డ్‌ఇన్ చేసిన కొత్త పరిశోధన ప్రకారం, భారతదేశంలోని 98% వ్యాపార నాయకులు 2025లో తమ సంస్థలు ఏఐ స్వీకరణను వేగవంతం చేయడంలో సహాయపడటం తమ వ్యూహాత్మక ప్రాధాన్యత అని అంటున్నారు. అయితే, సరైన నైపుణ్యాలతో కూడిన ప్రతిభను కనుగొనడం ఒక సవాలుగా మిగిలిపోయింది. భారతదేశంలోని ఐదుగురు రిక్రూటర్లలో దాదాపు ముగ్గురుకి ఏఐ, మానవ నైపుణ్యాల సరైన మిశ్రమాన్ని కనుగొనడం ఒక సవాలుగా నిలిచింది.

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్‌టెక్ అంతర్జాతీయ డెలివరీ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్: హెచ్‌సీఎల్‌టెక్ కొత్త అంతర్జాతీయ డెలివరీ సెంటర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించారు. సమాచార టెక్నాలజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి.విజయ కుమార్ కూడా కార్యక్రమానికి హాజర య్యారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశంలో గత ఏడాదిగా, తాము అత్యధికంగా పెట్టుబడులు స్వీకరించినట్లు తెలిపారు. దేశంలో ఏఐని అధికంగా అనుసరిస్తున్న వారిలో భాగంగా ఉన్నామన్నారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమం కింద తెలంగాణను ట్రిలియన్-డాలర్ ఆర్థిక వ్యవస్థగా చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఆధునికమైన ఈ డెలివరీ సెంటర్ హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్‌టెక్ అయిదవ కేంద్రం. హైటెక్ సిటీలో ఉన్న, ఈ 320,000 చ.అడుగుల కేంద్రం 5,000 మంది ఉద్యోగులు కూర్చుని పని చేయగల సామర్థ్యముంది.

ఏప్రిల్ 18న హైదరాబాద్‌కు అలాన్ వాకర్ వరల్డ్ టూర్

న్యూఢిల్లీ: గ్లోబల్ ఎలక్ట్రానిక్ మ్యూజిక్ పవర్‌హౌస్ అలాన్ వాకర్ అక్టోబర్ 2024లో తన 9-నగర వాకర్‌వరల్డ్ పర్యటన తర్వాత స్పేస్‌బౌండ్ ఆధ్వర్యంలో జరిగే షోతో భారతదేశాన్ని మరోసారి పలకరించనున్నాడు. ఇప్పుడు ఈ ఏప్రిల్ 2025లో తన సిగ్నేచర్ సౌండ్, విద్యుదీకరణ శక్తిని నాలుగు అదనపు భారతదేశ నగరాలకు తీసుకువస్తున్నాడు, అక్కడ అతను మొదటిసారిగా ప్లే చేయనున్నాడు. 1,60,000ం అభిమానులను కలిగి ఉన్న తన వాకర్ వరల్డ్ టూర్‌తో రికార్డులను బద్దలు కొట్టిన తర్వాత, వాకర్ ఇప్పుడు గువహతి, భువనేశ్వర్, హైదరాబాద్, జైపూర్‌లను తన మరపురాని ప్రత్యక్ష అనుభవం కోసం స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాడు. అలన్ వాకర్ వరల్డ్ ఇండియా టూర్ ఏప్రిల్ 17, 2025న గౌహతిలో ప్రారంభమవుతుంది, ఆ తర్వాత ఏప్రిల్ 18న హైదరాబాద్, ఏప్రిల్ 19న భువనేశ్వర్ మరియు ఏప్రిల్ 20, 2025న జైపూర్ ప్రారంభమవుతాయి. టిక్కెట్లు ఫిబ్రవరి 28, 2025 శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యక్ష ప్రసారం అవుతాయి. భారతదేశంలోని ప్రముఖ వినోద గమ్యస్థానమైన బుక్‌మైషోలో ప్రత్యేకంగా రూ. 999 నుండి ప్రారంభమవుతాయి.

యువతలో పెరుగుతున్న ఆస్టియో ఆర్థరైటిస్

హైదరాబాద్: ఒకప్పుడు వృద్ధుల పరిస్థితిగా భావించే ఆస్టియోఆర్థరైటిస్ ఇప్పుడు 25-40 ఏళ్ల మధ్య వయస్కులపై ఎక్కువగా ప్రభావం చూపుతోంది. ఎముకల చివరలను కుషన్ చేసే రక్షిత మృదులాస్థి కాలక్రమేణా క్షీణించినప్పుడు సంభవించే పరిస్థితి ఇది. ఆస్టియోఆర్థరైటిస్ ఏదైనా ఉమ్మడిని దెబ్బతీసినప్పటికీ, ఇది ఎక్కువగా చేతులు, మోకాలు, తుంటి, వెన్నెముకలోని కీళ్ళను ప్రభావితం చేస్తుంది. నిశ్చల జీవనశైలి ఈ ప్రమాదకర ధోరణికి ప్రధాన కారణమని హైదరా బాద్‌లోని మావెన్ మెడికల్ సెంటర్ సీనియర్ ఇంటర్వెన్షనల్ రేడియాల జిస్ట్ డాక్టర్ బాలాజీ పటేల్ కోలా పేర్కొన్నారు. "ఎక్కువసేపు కూర్చోవడం, పేలవమైన భంగిమ మరియు శారీరక శ్రమ లేకపోవడం వంటి నిశ్చల ఉద్యోగాలు ప్రారంభ ఆస్టియో ఆర్థరైటిస్కు ప్రధాన దోహదం చేస్తాయి. స్థూలకాయం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అధిక తీవ్రత కలిగిన క్రీడలు లేదా శారీరకంగా డిమాండ్ చేసే పని నుండి పునరావృతమయ్యే ఉమ్మడి ఒత్తిడి వంటి అంశాలు ఉమ్మడి క్షీణతను వేగవంతం చేస్తాయి. మానసిక ఒత్తిడి కూడా శరీరంలో మంటను ప్రేరేపించడం ద్వారా పాత్ర పోషిస్తుంది" అని డాక్టర్ కోలా చెప్పారు.

వివో ఇగ్నైట్ 2025కు అద్భుతమైన స్పందన

ముంబయి: సృజనాత్మక గ్లోబల్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ వివో, 'వివో ఇగ్నైట్' మూడవ ఎడిషన్‌ను అద్భుతమైన ప్రతిస్పందనను ప్రకటించడానికి థ్రిల్లింగ్‌గా ఉంది. 660కి పైగా జిల్లాల్లోని 9,000 పాఠశాలల నుండి 37,000 రిజిస్ట్రేషన్లను అందుకుంది. ఇది భారతదేశం మొత్తం జిల్లాలలో 85% పైగా కవర్ చేస్తుంది. నీతి ఆయోగ్ నిర్వచించిన 112 ఆకాంక్షాత్మక జిల్లాలలో 80 జిల్లాలు పాల్గొన్నాయి. యువ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడంలో, భారతదేశం అంతటా ఇటువంటి వేదికలలో పాల్గొనే అవకాశాలను అందించడంలో చొరవ లోతైన పరిధి, ప్రభావాన్ని హైలైట్ చేశాయి. 8-12 తరగతుల విద్యార్థులు 'టెక్ ఫర్ గుడ్' థీమ్ కింద 5,600 వినూత్న ప్రాజెక్టు ఆలోచనలను వ్యక్తిగత/సమూహ ఎంట్రీలుగా సమర్పించారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు (యుఎన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు) అనుగుణంగా వారి సమస్యా పరిష్కార నైపుణ్యాలు, సామాజిక ప్రభావం పట్ల నిబద్ధతను ప్రదర్శించారు. ఈ భారీ భాగస్వామ్యం భారతీయ యువత సృజనాత్మకతను, సాంకేతిక పరిజ్ఞానం పట్ల అభిరుచిని తెలియజేస్తుంది. ముఖ్యంగా గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం భాగస్వామ్యం రెట్టింపు అయింది.

'పీపుల్స్ ఎయిర్‌లైన్ ఆఫ్ ది ఇయర్'గా శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్

కొలంబో: భారతదేశంలోని తెలంగాణలోని ప్రీమియర్ డిజిటల్ బిజినెస్ ఛానల్ అయిన హైబిజ్ టీవీ అందిస్తోన్న హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025లో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ 'ఉత్తమ పీపుల్స్ ఎయిర్‌లైన్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. ఈ అవార్డులు తెలంగాణలోని వివిధ రంగాలలో వ్యాపారాలు సాధిం చిన అద్భుతమైన విజయాలను గుర్తిస్తాయి, దీనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ మద్దతు ఇస్తున్నాయి. ఇది భారతీయ కస్టమర్లలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ కు ఉన్న అపూర్వ ప్రజాదరణ ను ప్రతిబింబిస్తుంది. శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్ రీజినల్ మేనేజర్ ఫవ్వాస్ ఫరీద్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తంచేశారు. శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ భారతదేశం నుండి హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, కొచ్చి, త్రివేండ్రం, చెన్నై, తిరుచ్చి, మధురైలను కలుపుతూ వారానికి 90 విమానాలను నడుపుతోంది. అలాగే, హైదరాబాద్‌కు నాలుగు వీక్లీ విమానాలు నడుపుతోంది.

జస్ట్‌డయల్ మద్దతుతో వృద్ధిలోకి గుంటూరు వ్యాపారస్తులు

గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధానమైన వ్యాపార జిల్లా అయిన గుంటూరు, దాని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు ప్రసిద్ధి చెందింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మిరపకాయల ఎగుమతిదారు, వైద్య కేంద్రంగా, వస్త్రాలు, ప్లంబింగ్ నుండి డిజిటల్ సేవల వరకు వివిధ పరిశ్రమలలోని సంస్థలకు నిలయంగా ఉంది. వ్యాపారాలు తమ పరిధిని విస్తరించడానికి మార్గాలను అన్వేషిస్తున్నందున, జస్ట్‌డయల్ వాటిని డిజిటల్‌గా అభివృద్ధి చేయడంలో కీలక భాగస్వామిగా మారింది. గుంటూరులోని చిన్న, మధ్యతరహా వ్యాపారాలను సంభావ్య కస్టమర్‌లతో కనెక్ట్ చేయడం ద్వారా, శక్తివంతమైన రీతిలో ఆన్‌లైన్ కార్యకలాపాలను నిర్వహించటంలో వారికి సహాయం చేయడం ద్వారా జస్ట్‌డయల్ వారికి తగిన శక్తిని అందిస్తోంది. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా, వ్యాపారాలు ఎక్కువ లీడ్‌లను పొందుతున్నాయి. గుంటూరులోని అశోక్ కుమార్ టెక్స్‌టైల్స్ యజమాని వై.మురళి శివ ప్రసాద్, ప్లంబింగ్ వ్యాపారాన్ని నడుపుతున్న శ్రీను బాబు, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ఫైబర్, డీటీహెచ్ సేవల ప్రొవైడర్ అజయ్, కోవిడ్ -19 మహమ్మారి సమయంలో జస్ట్‌డయల్ గేమ్-ఛేంజర్‌గా గుర్తించారు.

విజయవంతంగా ముగిసిన ఎలెక్రామా 2025

గ్రేటర్ నోయిడా: ఇండియన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రోనిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఈఈఎంఏ) నిర్వహించిన ఎలెక్రామా 2025 16వ ఎడిషన్ ఎలక్ట్రికల్, అనుబంధ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ కోసం ప్రీమియర్ అంతర్జాతీయ ప్లాట్ ఫాంగా తన స్థానాన్ని పునః శక్తివంతం చేసి విజయవంతంగా ముగించింది. ఈ ఎడిషన్ గత రికార్డ్స్‌ను బద్దలు కొట్టింది. 1,000పైగా ఎగ్జిబిటర్స్, 400,000 వ్యాపార సందర్శకులను ఆకర్షించింది. 20 బిలియన్ వ్యాపార సందేహాలను ఉత్పన్నం చేసింది- ఇది కార్యక్రమం స్థాయి, ప్రభావం, అంతర్జాతీయ ఆకర్షణకు నిదర్శనంగా నిలిచింది. ఎలెక్రామా 2025 పరిశ్రమ పాల్గొనడానికి ఒక ముఖ్యమైన వేదికగా అభివృద్ధి చెందింది, ప్రభావవంతమైన బీ2బీ సమావేశాలను, అవగాహనతో కూడిన నాయకత్వపు సమావేశాలను, అంతర్జాతీయ మరియు భారతదేశపు భాగస్వాములను ఐక్యం చేసే నిర్మాణాత్మకైన పాలసీ సంభాషణలను చూపించింది.

బెట్టింగ్ నుండి రక్షణకు ఏఎస్‌సీఐ ప్రత్యేక వ్యవస్థ

ముంబై: ఆఫ్‌షోర్ సంస్థల అక్రమ బెట్టింగ్, జూదం ప్రకటనలపై పెరుగు తున్న ఆందోళనలను పరిష్కరించడానికి ఒక ముఖ్యమైన చర్యగా, అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) జనవరి 2, 2025 నుండి అమలులోకి వచ్చేలా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్), ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ (ఏఐజీఎఫ్), ఈ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్)తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఏఎస్‌సీఐ, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ సమాఖ్యల మధ్య ఒప్పందం, ఆఫ్‌షోర్ బెట్టింగ్, జూదం ప్రకటనలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు స్క్రీనింగ్ చేయడం, నివేదించడంపై దృష్టి పెడుతుంది. ఏఎస్‌సీఐ కోడ్‌ను ఉల్లంఘించే అవకాశం ఉన్న రియల్-మనీ గేమింగ్ ప్రకటనలను కూడా సెల్ స్క్రీన్ చేసి ప్రాసెస్ చేస్తుంది.

జీ తెలుగులో త్రిబుల్ బోనాంజా ఎంటర్‌టైన్‌మెంట్

విశాలాంధ్ర - ఆదిలాబాద్: జీ తెలుగు మరో త్రిపుల్ బొనాంజా ఎంటర్‌టైన్‌మెంట్ తో మార్చి 1 నుంచి 3 వరకు ప్రేక్షకుల ముందుకు రాబోతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా మార్చి 1వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రసారమవుతుందన్నారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా బాక్సాఫీస్ హిట్ గా నిలిచిందన్నారు. నాన్-ఫిక్షన్ షోలలో ఒకటైన సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ మార్చి 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రసారమవుతుంది. ఈ లాంచ్ ఎపిసోడ్‌కు ప్రముఖ నటులు శ్రీకాంత్, రోజా, రాశి, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు అతిథులుగా హాజరై మరింత వినోదాన్ని అందించనున్నారన్నారు. యాంకర్ రవి, అషు రెడ్డి వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్నారన్నారు. అలాగే, జీ తెలుగు మరో అద్భుతమైన కథతో రూపొందుతున్న లక్ష్మీ నివాసం సీరియల్‌ను మార్చి 3వ తేదీ నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు ప్రసారం చేస్తుందన్నారు.

సంపాదకీయం

అమ్మకానికి అమెరికా పౌరసత్వం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కేవలం కోతల మనిషి కాదు చేతల మనిషి అని తేలిపోయింది. అమెరికా పౌరసత్వం ఇక ట్రంప్ హయాంలో డబ్బిచ్చి కొనుక్కో వచ్చు. ఇప్పటిదాకా అమలులో ఉన్న ఇ.బి-5 వీసా బదులు రెండు వారాల్లో "గోల్డ్ కార్డ్" వీసా ప్రవేశ పెడ్తున్నట్టు ట్రంప్ తెలియజేశారు. అయిదు మిలియన్ డాలర్లు చెల్లించగలిగే విదేశీయులకు నేరుగా అమెరికా పౌరసత్వం దక్కుతుంది. అమెరికా పౌరసత్వం ట్రంప్ హయాంలో అంగడి సరుకు అయిపోయింది. అయిదు మిలియన్ డాలర్లు అంటే మన రూపాయిలో 43,57,26,000 అవుతుంది. అంటే 43 కోట్ల రూపాయలు చెల్లించగలిగితే అమెరికా పౌరులు అయిపోవచ్చు. ఇప్పటిదాకా అమలులో ఉన్న ఇబి-5 వీసా కింద వలసదార్లు 1,050,000 డాలర్లు పెట్టుబడి పెడ్తే సరిపోయేది. అంటే రూ. 9,15,07,237 చెల్లించ గలిగితే సరిపోయేది. ట్రంప్ నూతన విధానం ప్రకారం అమెరికా పౌరసత్వం కావాలనుకునే వారు చెల్లించవలసి వచ్చే సొమ్ము కన్నా ఇక ముందు కనీసం అయిదు రెట్లు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. ఇబి-5 వీసా కింద అమెరికాలో పెట్టుబడులు పెట్టి, పౌరసత్వం సంపాదిం చాలనుకునే వారు తాము ప్రారంభించే సంస్థల్లో పది మంది అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాదర బందీ ఉండకపోవచ్చు. ఇంతకు ముందు గ్రీన్ కార్డు మంజూరు అయిన తరవాత కొంతకాలానికి అమెరికా పౌరసత్వం వచ్చేది. ఇప్పుడు అయిదు మిలియన్ డాలర్లు చెల్లిస్తే గ్రీన్ కార్డు ఉన్నవారికి దక్కే సదుపాయాలన్నీ దక్కుతాయి. ఇది అమెరికా పౌరసత్వానికి రహదారిగా కూడా పని చేస్తుంది. గోల్డ్ కార్డ్ విధానం వల్ల సంపన్నులు తమ దేశానికి వస్తారని ట్రంప్ నిస్సిగ్గుగా చెప్పేశారు. తద్వారా అమెరికా ఖజానా నిపడం కూడా తమ ఉద్దేశం అని ట్రంప్ అన్నారు. ఇంతవరకు హెచ్1బి వీసా రానివారు ఇబి-5 వీసా మీద ఆధారపడే వారు. ఇప్పుడు భారీగా పెట్టుబడి పెట్టగలిగే సంపన్నులకు అమెరికాలో సునాయాసంగా ప్రవేశం ఉంటుందన్న మాట. అయితే నైపుణ్యం గల భారతీయ వృత్తి నిపుణులు దీర్ఘ కాలంగా గ్రీన్ కార్డు కోసం వేచి ఉన్నారు. గోల్డ్ కార్డు విధానం ఇలాంటి వారికి ఎంత మాత్రం ఉపయోగపడదు. గోల్డ్ కార్డు ప్రధానంగా అమెరికాలో ప్రవేశించాలనుకునే సంపన్నులను ఆకట్టు కోవడానికి ఉద్దేశించింది. నైపుణ్యం ఉన్న వారికి ఈ నూతన విధానం ఎంత మాత్రం ఉపకరించదు. అమెరికా వెళ్లి పెట్టుబడులు పెట్టాలనుకునే భారతీయులకు ఇది ఇబ్బందికరమైందే. ఎందుకంటే భారీగా డబ్బు చెల్లించి గోల్డ్ కార్డ్ తీసుకోవలసి ఉంటుంది. అంటే డబ్బున్న ఆసాములకే ఇది ఉపకరిస్తుంది. బాగా సంపన్నులకే అమెరికాలో శాశ్వత నివాసం ఏర్పరచుకునే అవకాశం ఉంటుంది. 2024 డిసెంబర్ నాటికి ఉద్యోగాలు కల్పించగలిగే వారి 2,34,000 దరఖాస్తులు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ప్రస్తుతం ఒక్కో దేశానికి 25,620 వీసాలు మాత్రమే ఇవ్వాలన్న నియమం ఉంది. దీనివల్ల చాలా మంది భారతీయులు సుదీర్ఘ కాలంపాటు వేచి చూడవలసి వస్తోంది. నూతన గోల్డ్ కార్డు విధానం ఉపాధి, నైపుణ్యాల కన్నా సంపత్తిగల వారిని ఆకర్షించడం మీదే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తుంది. వేచి ఉన్న వారి జాబితా నూతన విధానం ద్వారా తగ్గదు కానీ సంపన్న పెట్టుబడిదార్లు భారీగా సొమ్ము చెల్లించగలిగితే వారికి మార్గం సుగమం అవుతుంది.

గోల్డ్ కార్డ్ విధానం సంపద ఉన్న వారికి, నైపుణ్యం ఉన్న వారికి మధ్య తీవ్ర అఖాతంగా తయరవుతుంది. ఇది భారత-అమెరికా సమాజాల మధ్య అంతరం కూడా సృష్టిస్తుంది. గోల్డ్ కార్డు విధానం అమలులోకి వస్తే సమానత్వం, అంతర్జాతీయ సంబంధాల మీద కూడా తీవ్ర ప్రభావం పడొచ్చు. ట్రంప్ ప్రవేశ పెడ్తున్న గోల్డ్ కార్డ్ విధానం సంపన్నులకు పచ్చజెండా ఊపడానికి ఉద్దేశించిందే. కేవలం అత్యున్నత స్థాయి వారికి మాత్రమే ఈ విధానం ఉపయుక్తంగా ఉండొచ్చు. ఇది మనుషుల మధ్య వారి నైపుణ్యంతో నిమిత్తం లేకుండా ఈ ఖరీదైన విధానంవల్ల తమ బడ్జెట్ లోటు పూడుతుందని కూడా డోనాల్డ్ ట్రంప్ తెగేసి చెప్పారు. 1990 వ సంవత్సరంలో ప్రవేశ పెట్టిన విధానం ఇబి-5 వీసా విధానంలో పది లక్షల డాలర్లు పెట్టుబడి పెడ్తే సరిపోయేది. ఆ పద్ధతిలో గ్రీన్ కార్డ్ సంపాదించిన వారికి కొన్నాళ్ల తరవాత పౌరసత్వం దక్కేది. దీనివల్ల ఏమ్రికన్లకు ఉపాధి అవకాశాలు కూడా ఉండేవి. ఇబి-5 వీసా కింద గ్రామీణ ప్రాంతాలలో, నిరుద్యోగం అత్యంత అధికగా ఉన్న ప్రాంతాలలో ఇబి-5 వీసాకు కొంచెం తక్కువ పెట్టుబడి పెట్టడానికీ అవకాశం ఉండేది. అంటే 8,00,000 డాలర్లు చెల్లిస్తే వీసా దొరికేది. మౌలిక సదుపాయాలు కల్పించే వ్యాపారం చేసే వారికి కూడా ఈ సదుపాయం ఉండేది. ఇబి-5 వీసా విధానం కింద ఏటా 10,000 వీసాలు మాత్రమే జారీ అయ్యేవి. అందులో 3,000 వీసాలు నిరుద్యోగం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పెట్టుబడులు పెట్టగలిగిన వారికి వీసాలు ఇచ్చేవారు. ఇబి-5 వీసాల మంజూరు కారు చౌకగా ఉండేదని, ఇది అర్థ రహితమైందని, నమ్మబలికేదిగా, మోసపూరితంగా ఉండేది కనక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్తగా గోల్డ్ కార్డ్ విధానం ప్రవేశ పెట్టబోతున్నారు. పాత పద్ధతి ప్రకారం అయితే డబ్బు పెట్టి వీసా పొందే వారికి ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చేదో తెలుసుకోవడం కష్టంగా ఉండేదంటారు. ఇందులో ఆశ్రిత పక్షపాతానికి కూడా అవకాశం ఉండేదట. ఈ రుగ్మతలు ఇక మీదట తగ్గినా గోల్డ్ కార్డు వీసా చాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోవడం మాత్రం ఖాయం. కోటి గోల్డ్ కార్డులు జారీ చేయడానికైనా ట్రంప్ సిద్ధమట. కోటి గోల్డ్ కార్డులు జారీ చేయగలిగితే మన రూపాయల లెక్కల్లో అమెరికా ఖజానాకు 4,36,77,00,00,00,00,000 చేరతాయి. ఇది భారతీయ పెట్టుబడిదార్లకు పెద్ద విఘాతమే. అమెరికాలో గ్రీన్ కార్డు కోసం వేచి ఉన్నవారు ఇప్పటికే పది లక్షలకు పైగా ఉన్నారు. ఇవి అమెరికా ప్రభుత్వ లెక్కలే. స్పెయిన్, గ్రీస్ లాంటి దేశాల్లో ఇప్పటికే గోల్డ్ కార్డు లాంటి పథకాలు అమలులో ఉన్నాయి. మాల్టా, ఈజిప్ట్, జోర్డాన్‌లో పెట్టుబడి పెడ్తే నేరుగా పౌరసత్వం సంపాదించవచ్చు. గోల్డ్ కార్డు పొందే వారు అమెరికా చట్టాల ప్రకారం భారీగా పన్నులు చెల్లించవలసి రావొచ్చు. అమెరికాలో పన్నులు ఎగ్గొట్టడం సులభం కాదు. డబ్బిస్తే పౌరసత్వం ఇచ్చే దేశాలు ఇంతకు ముందే ఉన్నాయి.

పార్టీలు ప్రజల కోసమేనా!

బండారు రాధాకృష్ణ

పార్టీలు ప్రజల కోసమా లేక పార్టీ పెద్దల కోసమా! ప్రజల కోసమైతే ప్రజా సమస్యల కోసం ఎందుకు కలవరు. నా బుర్ర పగిలిపోతోంది. ఏంటి బావ ఉదయాన్నే పార్టీల మీద పడ్డావు. ఏమయింది యిప్పుడు. ఏమయిందని తాపీగా అడుగుతావేంటి. అసలు ప్రజా సమస్యలు పట్టవా నాయకులకు. ప్రజలంతా సమస్యల తోరణాలు కట్టుకుని అరుస్తుంటే అటు ప్రభుత్వానికి ఇటు ప్రతిపక్ష నాయకులకు ఆ అరుపులు వినపడవా. అదేంటి అంత మాటన్నావు. నీవన్నట్లు రాజకీయ పార్టీలు, అనేక రకాల సంస్థలు, సంఘాలు అన్ని ప్రజల కోసం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటయినవే. కాని పార్టీ నాయకులలో కొందరి మెతకతనంతోనో, స్వార్థంతోనోఅనుకున్నట్లు పని చేయని మాట నిజం. నిన్నగాక మొన్న వామపక్షాలు మిర్చి రైతుల గురించి విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వెంట వచ్చిన ప్రజల్ని చూసిన తరువాత ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇది ప్రభుత్వానికి తగని పని. ఎవరూ ఊహించని మెజార్టీతో గెలిపించినా ప్రజల గురించి అందునా సమాజానికి వెన్నుముకగా పిలుచుకునే రైతుల సమస్యలపై పట్టించుకోక పోవడం విచారకరం. అది నరేనయ్యా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలెన్నుకున్న పార్టీలు ప్రజల కోసం పని చేయని దుస్థితి ప్రస్తుతం నెలకొంది. దాంతో పార్టీలు ప్రజల కోసమా లేక పార్టీ పెద్దల కోసమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజంగా ప్రజల కోసమైతే ప్రజాహితం కోరే పార్టీలన్నీ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అందల మెక్కేదాక ఒక మాట, ఎక్కిన తరువాత ఒక మాట మాట్లాడుతున్న రాజకీయ పార్టీల తీరు నిరసించి నిలదీయడానికి ప్రజాహిత పార్టీలన్ని ఒకే గొంతుతో నిలబడాలి. ప్రజలు అడగక పోయినా శుష్క



వాగ్దానాలతో అమాయక ప్రజల్ని నమ్మించి ఓట్లు పొంది గద్దె నెక్కి మా వల్ల కాదనడం గర్హనీయం. నలభై ఏళ్ల రాజకీయ అనుభవంతో పాటు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర ఖజానా గురించి ఎన్నికల ముందు తెలయకనె వరాల జల్లు కురిపిం చారనుకోవాలా. ఇది ప్రజల్ని మోసం చేయడం కాదా? అసలు ప్రజల సమస్యలపై పోరాటం చేయవలసిన పార్టీలు మౌనం వహించడం న్యాయం కాదు. ఇప్పటికైనా ప్రజల కోసం ప్రజలెన్నుకున్న పార్టీలు బాధ్యతతో సమస్యల పరిష్కారం కోసం అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా లేనప్పుడు ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడడానికి ఒక శాసన సభ్యుని కిచ్చే సమయం చాలదని అంటున్నారు. గతంలో ఇద్దరున్న బీజేపీ పార్టీ వారు పార్లమెంటులో హాజరయి మాట్లాడారని అలాగే కొన్ని ఉదాహరణలతో ఒక పత్రిక రాసింది. కాని ఆనాడున్న క్రమశిక్షణ చట్ట సభలలో యిప్పుడు లేదన్న సంగతి ఆయనకు తెలియదనుకోవాలా? నెహ్రూ కాలంలో ప్రతిపక్ష నాయకుల ప్రసంగం పూర్తిగా విని కొన్ని సవరణలు చేసుకున్న ఉదంతాలున్నవి. ఇప్పుడటువంటి పరిస్థితి ఉందని సదరు వ్యక్తి భావిస్తున్నారా. జగన్ ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని అప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడడానికి సమయం ఉంటుందని కనుక హోదా ఇవ్వమని అడగడం చట్టానికి వ్యతిరేకమే కాని చట్టంలోని నిబంధనలు పక్కన పెట్టి తమకు అనుకూలంగా ప్రభుత్వాలు ఎన్నో సవరణలు చేసుకుని వ్యవహరించిన ఘటనలు గతంలో జరిగాయి. నిజంగా ప్రజల కోసం, ప్రజా హితం కోరి వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తే జగన్ హోదా ద్వారా అడిగే ప్రశ్నలకు ప్రభుత్వంతో సంబంధం లేకుండా పరిష్కారం పొందిన ప్రజలే సమాధానం చెబుతారు. నిజంగా ప్రజా హితం కోరే ప్రభుత్వమైతే చట్టాన్ని పక్కన పెట్టి హోదా ఇవ్వడానికి వెనకడుగు వేయనవసరం లేదు. హోదా ఇవ్వకపోయినా ప్రతిపక్ష నాయకునికి ఇచ్చే సమయం ఇస్తానని వాగ్దానం చేయవచ్చు. ప్రజా సమస్యలపై మాట్లాడే వారికి సమయం ఇవ్వడం ప్రజా ప్రభుత్వాల బాధ్యతగా భావించాలి. అంతేగాని చట్టాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల గురించి మాట్లాడే సభ్యుల ఫోను కట్ చేయడం ప్రజా ప్రభుత్వాలకు తగని పని.

ప్రజాస్వామ్య దేశాలలో ప్రజల కోసం చట్టం చేయడం వరకే ప్రభుత్వాల పని. వాటిని సక్రమంగా అమలు పరచవలసిన బాధ్యత అధికారులది. కాని రానురాను చట్టం చేసిన తరువాత ప్రతి విషయంలోను మంత్రుల జోక్యం కనబడుతోంది. ఎన్నికల వరకే పార్టీలు ఆ తరువాత ప్రజలందరి కోసం పని చేయవలసిన మంత్రులు తమ పార్టీలో ఉన్నవారే ప్రజలని ఇతర పార్టీలకు చెందిన ప్రజల గురించి పట్టించుకోనవసరం లేనట్లుగా వ్యవహరించడం గమనార్హం. ఈ జబ్బు అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని పార్టీలలోను కనబడుతోంది. ప్రతి చిన్న విషయానికే కాక అధికారంలో ఉన్న పార్టీకి సంబంధించిన వ్యక్తి సొంత విషయానికి కూడా మంత్రుల జోక్యం ఉంటోందని, కష్టపడి సాధించిన ఐఏఎస్, ఐపీఎస్‌లను పక్కన పెట్టి మంత్రి చెప్పింది చేయడానికి అలవాటుపడాల్సిన పరిస్థితి కలెక్టర్లకు దాపురించిన రాజకీయం నేడు నడుస్తోంది. ప్రజా సమస్యలు పరిష్కరించే ప్రభుత్వానికి సమస్యలపై మాట్లాడే ప్రతిపక్షానికి సమయం ఇవ్వడానికి భయపడవలసిన పని లేదు. ఏది ఏమైనా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిపక్ష, వామపక్ష పార్టీలన్నీ ఒకే గొంతుకతో పనిచేస్తే ప్రజలు సంతోషిస్తారు.

సెల్: 9885569394

ఇసుకపై కేంద్ర రాష్ట్రాల ఘర్షణ...!

కె.రవీంద్రన్

> కోస్తా తీర జలాల్లో ఇసుక తవ్వకం వాతావరణానికి సంబంధించిందే కాదు, ఆర్థిక విషయానికి సంబంధించింది కూడా. ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలపై అక్కడి పాలకులు, ప్రజలు తమ సార్వభౌమత్వాన్ని ప్రకటిస్తారు. అంతేకాదు కేంద్ర ప్రభుత్వ దురాక్రమణ అని కూడా ప్రజలు ప్రతిఘటిస్తారు.

ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల కోస్తా తీర ప్రాంతాల జలాల్లో ఇసుక తవ్వడానికి ప్రయత్నిస్తున్నందున బీజేపీ నాయకత్వంలోని మోదీ ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య ఘర్షణ రేకెత్తే అవకాశాలున్నాయి. ఈ ఘర్షణ కేవలం వాతావరణ, ఆర్థిక అంశాలకు సంబంధించినవి మాత్రమే కాదు, ఇండియా భౌగోళిక, ఎన్నికలకు సంబంధం గలవి కూడా అవుతాయి. ఇందుకు సంబంధించిన జాతులు ఈ సమస్యను లేవనెత్తుతాయి. హిందీ రాష్ట్రాల కీలక ప్రాంతాలలోని కోస్తాలో బీజేపీకి చారిత్రకంగా తక్కువ ప్రదేశాలలో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉంది. అయితే ఈ ప్రాంతాల్లో ప్రతిపక్షాలకు అధిక పలుకుబడి ఉంది. ఇప్పుడు తీర ప్రాంత జలాల్లో ఇసుక తవ్వకాలపై చర్చలు జరుగుతున్నాయి. అధికారం, పరిపాలనకు సంబంధించి ఆర్థిక విధాన నిర్ణయంపైన చర్చలు సాగుతున్నాయి.

బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాలు ఒకదానికొకటి కలిసి ఉంటాయి. ఈ రాష్ట్రాల్లో కోస్తా తీర ప్రాంతంలో జీవనాధారాలు అనుసంధానమై ఉంటాయి. అయితే కోస్తా తీరం భారీగా ఉన్న రాష్ట్రాలు- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో రాజకీయ నాయకత్వం కోస్తా ప్రాంతంలో నివసించే జనాభా పైన భారీగా నిధులు ఖర్చు చేస్తాయి. ఈ రాష్ట్రాలు సంప్రదాయంగా బీజేపీ అనసరించే హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తూ ఉన్నాయి. ప్రస్తుత ఈ ఘర్షణ వెనుక వైరుధ్య స్వభావం కలిగి ఉంది. కోస్తా తీర జలాల్లో ఇసుక తవ్వకం వాతావరణానికి సంబంధించిందే కాదు, ఆర్థిక విషయానికి సంబంధించింది కూడా. ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలపై అక్కడి పాలకులు, ప్రజలు తమ సార్వభౌమత్వాన్ని ప్రకటిస్తారు. అంతేకాదు కేంద్ర ప్రభుత్వ దురాక్రమణ అని కూడా ప్రజలు ప్రతిఘటిస్తారు.

మత్స్యకారుల ఆందోళన:

కోస్తా తీర జలాల్లో ఇసుక తవ్వినట్టైతే అందరి కంటే ముందుగా మత్స్యకారులు తీవ్ర ఆందోళన చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తీర జలాల్లో చేపలు పట్టుకొని జీవించటం పెరగటం వల్ల వాతావరణ మార్పు, ప్రతికూల ప్రభావం పెరిగింది. దీనిపై ఆందోళనా వ్యక్తమవుతోంది. జలాల్లో ఇసుక తవ్వినట్టైతే మత్స్యకారుల జీవన భృతికి తీవ్ర ముప్పు కలుగుతుంది. అప్పుడు వీరు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా తప్పనిసరిగా ఆందోళనకు దిగుతారు. కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లైతే అది తమ జీవన భృతికి మరో ముప్పు అవుతుందని ఆందోళన పడతారు. కేరళలోని కోస్తా తీరంలో మత్స్యకారులు తమ జీవన భృతికి ఇసుక తవ్వకం తీవ్ర ముప్పు కలిగిస్తుందని ఇప్పటికే ఆందోళనకు పూనుకున్నారు. తమ జీవన భృతి లేకుండా ప్రభుత్వం చేస్తోందని మత్స్యకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వకం జరిగినట్టైతే తీర ప్రాంతం కోసుకు పోతుందని, సముద్రం వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని, తీర వైవిధ్యం ధ్వంసం అవుతుందని, ఇవన్నీ నేరుగా మత్స్యకారులపై ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. సముద్రంపై జీవించే వేలాది కుటుంబాల జీవితాలు నాశనమవుతాయన్నది వాస్తవం.

ఈ అంశంపై శాస్త్రీయ అధ్యయనం, సర్వేలు కేరళ కోస్తా తీరంలో జరుగుతున్నాయి. మత్స్యకారులు, ప్రజలు ఆందోళన చెందటంలో న్యాయం ఉంది. సముద్రంలో భిన్న విధాలుగా తీర జీవనం పగడాల దిబ్బలు, సముద్రంలో గడ్డి కయ్యలు వివిధ రకాల పక్షులు, జీవులు ధ్వంసం అవుతాయి. ఇవన్నీ వాతావరణ సమతుల్యాన్ని కాపాడతాయి. సున్నితమైన మట్టి నిర్మాణం తీర వాతావరణ వ్యవస్థకు భారీగా ప్రమాదం కలుగుతుంది. సముద్ర జలాల్లో ఇసుక తవ్వినట్టైతే జలాల్లోని మడ్డిగా ఉండే మట్టి చెల్లాచెదరై పోతుంది. ఈ మడ్డి అంతా సుదూర ప్రాంతాలకు కొట్టుకు పోతుంది. సముద్రంలో ఉండే పగడాల దిబ్బలు ఇప్పటికే చాలా దెబ్బతిన్నాయి. అలాగే నీటి స్వచ్ఛత దెబ్బతింటుంది. సముద్ర జలాల్లో ఇసుక తవ్వకం కోస్తా తీర రక్షణపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుంది. క్రమంగా ఇసుక కోస్తా తీరాలకు చేరటం మూలంగా సముద్ర జలాలు స్థాయి పెరుగుతుంది. తద్వారా తుపాన్లు వచ్చే ప్రమాదం ఉంది. సముద్ర జలాల నుంచి ఇసుకను తోడేయటం వల్ల తీర ప్రాంతాల కోత పెరుగుతుంది. సముద్ర జలాలకు కొద్ది దూరంలో నివసించే ప్రజలు ఎల్లవేళలా ముప్పుకు గురవుతారు. అలాగే వాతావరణ పరిస్థితులు ఎక్కువగా మారిపోతుంటాయి. ఈ పరిస్థితులను కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఎక్కువగా అనుభవిస్తుంటాయి. దీర్ఘకాలికంగా వాతావరణం దెబ్బతినడానికి, సామాజిక సుస్థిరతకు తక్కువ కాలం ఆర్థిక ప్రయోజనాల కోసం ఇసుక తవ్వకం విధానం సరైంది కాదని వాతావరణ నిపుణులు విమర్శిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం తీర ప్రాంత జలాల్లో ఇసుక తవ్వకాన్ని ప్రతిపాదించటం వాస్తవంగా తీవ్రమైన సమస్య రాజకీయ ఆందోళనలకు దారి తీస్తుంది. కోస్తా రాష్ట్రాలు ఎక్కువగా ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్నాయి. అన్ని రాష్ట్రాలను ప్రత్యేకించి ప్రతిపక్ష రాష్ట్రాలను సంప్రదించకుండానే కేంద్రం ఏకపక్ష నిర్ణయం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకుని పార్లమెంటులో ఆమోదించినట్లైతే ప్రతిపక్ష రాష్ట్రాలలో తీవ్ర ఆందోళన తలెత్తుతుంది. అయితే తీర ప్రాంత సముద్ర జలాల్లో ఇసుక తవ్వకపోతే నిర్మాణానికి అవసరమైన ముడి వస్తువులు డిమాండ్‌ను తట్టుకోలేమని అందువల్ల తవ్వడం సరైందని కేంద్రం వాదిస్తోంది. వేగంగా పట్టణీకరణ జరుగుతోంది. దేశ వ్యాప్తంగా మౌలిక నిర్మాణాల అభివృద్ధి జరుగుతోంది. అందువల్ల ఇసుక డిమాండు ఆకాశాన్ని అంటుతోంది. దీనివల్ల అక్రమంగా కూడా సముద్ర జలాల్లో ఇసుక తవ్వకం చోటు చేసుకుంటోంది. సముద్ర జలాల్లో ఇసుక తవ్వకానికి కేంద్రం చట్టబద్దమైన అధికారం కలిగి ఉన్నదని ప్రభుత్వం చెబుతోంది.

తెలుగునాట అ.ర.సం. నిర్మాణం

ఆర్వీ రామారావ్

అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం 1936లోనే ఏర్పడినా తెలుగునాట ఈ సంఘం వ్యవస్థా రూపం ధరించడడం 1943 దాకా ఆగాల్సి వచ్చింది. అయితే తెలుగునాట అ.ర.సం. ఏర్పడడానికి ముందే సామాజిక రంగంలో కందుకూరి వీరేశ లింగం, సాహిత్య రంగంలో గురజాడ అప్పారావు, భాషా రంగంలో గిడుగురామ మూర్తి ఫ్యూడల్ భావజాలాన్ని గట్టిగా వ్యతిరేకించారు. 1900 నుంచి 1930 మధ్య కందుకూరి, గురజాడ, గిడుగు రామమూర్తి ఉదాత్త ఆశయాలు నిర్లక్ష్యానికి గురైనాయి. ఇంకో వైపు బ్రిటిష్ పాలనపై ప్రజల్లో కోపాగ్ని పెరిగి పోయింది.

తిరుగుబాట్లు, స్వాతంత్ర్య పోరాటం, కార్మికుల సమ్మెలు కాల్పనిక కవులను ఏ మాత్రం కదిలించలేక పోయాయి. అల్లూరి సీతారామరాజు నడిపిన మన్యం తిరుగుబాటు, ఆయన ఆత్మార్పణ రచయితలకు పట్టలేదు. కాల్పనిక కవులు ఊహాప్రేయసి చేలాంచలాల కొసగాలుల కోసం ఉవ్విళ్లూరుతూ ఉండిపోయారు. సామాజిక వాస్తవికతను పట్టించుకోలేదు. కాల్పనిక సాహిత్యానికి నిర్దిష్ట సామాజిక దృక్పథం, తాత్విక భూమిక లేనందువల్ల దాని సంస్థాగత నిర్మాణ రూపమైన "నవ్య సాహిత్య పరిషత్తు" నిర్వీర్యం అయిపోయింది. ఈ నిస్తేజాన్ని తొలగించడానికే 1943 ఫిబ్రవరి 13-14 తేదీల్లో తెనాలిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం అవతరించింది.

సాహితీ రంగంలో ప్రగతిశీల భావజాలం ఉన్న రచనలు వెలువడిన తరవాతే అ.ర.సం. ఏర్పాటుకు అవకాశం కలిగింది. జాతీయ స్థాయిలో కూడా ఇలాగే జరిగింది. 1930లో తెలుగు సాహిత్యానికి శ్రీశ్రీ మార్గ నిర్దేశి అనడంలో సందేహమే లేదు. కాని "పులిపంజా"కవి పురిపండా అప్పలస్వామి శ్రీశ్రీ కన్నా ముందే తెలుగు కవిత్వానికి కొత్త రూపు ఇచ్చారు. ఈ రకంగా పురిపండా కవితా రూపం మారిస్తే శ్రీశ్రీ సారంలో గుణాత్మకమైన మార్పు తీసుకొచ్చారు. 1943లో ఆంధ్ర రాష్ట్ర అభుదయ రచయితల సంఘం వ్యవస్థాపక మహాసభ జరగడానికి ముందు ప్రగతిశీల భావాలు కలిగిన రచయితల తోడ్పాటుతో సన్నాహక సంఘ సమావేశం జరిగింది. చదలవాడ పిచ్చయ్య, శ్రీశ్రీ, తుమ్మల వెంకట రామయ్య, తాపీ మోహన్‌రావును సన్నాహక సంఘం కన్వీనర్లుగా నియమించారు. 1942 డిసెంబర్ 4న తెనాలిలో మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పరచడానికి ఒక సమావేశ జరిగింది. అప్పటికి ఇంకా అభ్యుదయ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం అన్న మాటలు రూపుదిద్దుకోలేదు. 1943 ఫిబ్రవరి 13,14 తేదీల్లో తెనాలిలో ఏర్పడిన ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలో తాపీ ధర్మారావు అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ సమావేశంలోనే అ.ర.సం. ప్రణాళిక రూపొందించారు.

తుమ్మల వెంకట్రామయ్య



తాపీ ధర్మారావు



వట్టికోట ఆళ్వార్ స్వామి

శ్రీశ్రీ

హైదరాబాద్ సంస్థానంలో

తెనాలి మహాసభకు అప్పటి హైదరాబాద్ సంస్థానం నుంచి ప్రముఖ రచయిత వట్టికోట ఆళ్వార్ స్వామి హాజరయ్యారు. చర్చల్లో చాలా చురుకుగా పాల్గొన్నారు. అ.ర.సం. ప్రణాళిక ఆమోదించడంలో కూడా ఆళ్వార్ స్వామి చాలా క్రియాశీలంగా వ్యవహరించారు. హైదరాబాద్ సంస్థానంలో కూడా అ.ర.సం. నిర్మాణానికి ఇతర సాహితీ మిత్రులను సంప్రదించి కృషి చేస్తానని చెప్పారు. ఆళ్వార్ స్వామికి ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గంలో స్థానం కల్పించారు. తెనాలి నుంచి వచ్చిన తరవాత మీజాన్ పత్రికలో పని చేస్తున్న రాంభట్ల కృష్ణమూర్తి, సింగరాజు లింగమూర్తి, అడవి బాపిరాజు, విద్వాన్ విశ్వం తో చర్చించి అ.ర.సం. ఏర్పాటుకు ఆళ్వార్ స్వామి, భాస్కరభట్ల, ఇల్లిందల సరస్వతీ దేవి సంతకాలతో సమావేశం నోటీసు విడుదలైంది. రాం కోఠీలోని దివ్యజ్ఞాన సమాజం హాలులో సభ జరుగుతుం దని ఆ ప్రకటనలో ఉంది. అయితే ఈ సమావేశం జరిగినట్టు ఏ పత్రికలోనూ వార్త ప్రచురితమైన దాఖలాలు లేవు. అంటే ఆళ్వార్ స్వామి ప్రయత్నాలు ముందుకు సాగనట్టే. తరవాత కొంత కాలానికి దాశరథి, ఆళ్వార్ స్వామి, మరి కొందరు కలిసి తెలంగాణ రచయితల సంఘం ఏర్పాటు అవుతుందని ఆ నాటి ప్రముఖ రచయితలు వెల్లడించారు. ఈ సంఘం కొంతకాలం పని చేసింది. అంటే అ.ర.సం. 1970ల తొలినాళ్లలో సాధ్యం అయ్యేదాకా తెలంగాణాలో అభ్యుదయ రచయితల సంఘం ఊసే లేదు. కానీ అభ్యుదయ రచయితలు ఉన్నారు.

బాక్సర్‌కు వరకట్న వేధింపులు

చండీగఢ్: అర్జున అవార్డు గ్రహీత, ప్రపంచ మాజీ ఛాంపియన్ బాక్సర్ స్వీటీ బూర వరకట్న వేధింపులు ఎదుర్కొంటున్నారు. అడిగినంత ఇచ్చినా... అదనపు కట్నం కోసం తన భర్త, అత్తింటివారు వేధిస్తున్నారని, భౌతిక దాడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె పోలీసులను ఆశ్రయించారు. దీంతో భర్త దీపక్ హుడా, అతడి కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. హర్యానాకు చెందిన కబడ్డీ ఆటగాడు దీపక్ హుడాతో 2022లో స్వీటీకి వివాహమైంది. పెళ్లి సమయంలో తన పుట్టింటి వారు రూ.కోటి కట్నంతో పాటు ఫార్చునర్ కారును కానుకగా ఇచ్చారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ ఇంకా కట్నం తీసుకురావాలని తనపై దాడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు... దీపక్ హుడాకు సమన్లు జారీ చేశారు. అయితే, అనారోగ్య కారణాలతో అతడు విచారణకు రాలేదు. దీంతో అతడిపై కేసు నమోదు చేశారు. మరోవైపు, భర్త నుంచి విడాకులు కోరుతూ స్వీటీ బూర ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రొఫెషనల్ బాక్సర్ అయిన స్వీటీ... 2023లో జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచింది. గతేడాది ఫిబ్రవరిలో భర్తతో కలిసి బీజేపీలో చేరింది. గత నెల్లోనే రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున్ అవార్డు అందుకుంది. 2016లో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణ పతకం, 2014 ఏషియన్ గేమ్స్‌లో కాంస్యం సాధించిన భారత కబడ్డీ జట్టులో దీపక్ హుడా సభ్యుడిగా ఉన్నాడు. ప్రొ కబడ్డీ లీగ్‌లోనూ ఆడాడు. గతేడాది హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. దీపక్ కూడా అర్జున్ అవార్డు గ్రహీత.

ముస్లిం పేర్లు మార్చాలన్న బీజేపీ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం హిందూత్వ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకువెళుతోంది. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ నగరాలు, వీధులకు ఉన్న ముస్లిం పేర్లు తొలగిస్తున్నది. తాజాగా తమ నియోజకవర్గాల్లో ఉన్న ముస్లిం పేర్లు మార్చాలంటూ గురువారం బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. 'నజాఫ్‌గఢ్' పేరును 'నహర్‌ఘర్'గా మార్చాలని బీజేపీ ఎమ్మెల్యే నీలం పహల్వాన్ తన ప్రతిపాదనలో పేర్కొన్నారు.

మొఘల్ పాలకుడు ఔరంగజేబు నియోజకవర్గం పేరును మార్చారని, అసలు పేరును పునరుద్ధరించాలని కోరారు. ఆర్‌కేపురం నియోజకవర్గంలోని మహ్మద్‌పూర్ పేరును మాధవపూర్‌గా మార్చాలంటూ ఆర్‌కేపురం ఎమ్మెల్యే అనిల్ శర్మ సైతం అసెంబ్లీలో ప్రతిపాదన సమర్పించారు. తన నియోజకవర్గం దిల్లీ గ్రామీణ ప్రాంతానికి చెందినదని, హర్యానాలోని మూడు ప్రాంతాలకు సరిహద్దుగా ఉందని నీలం పహల్వాన్ అసెంబ్లీకి తెలిపారు. మొఘల్ పాలకుడు, చక్రవర్తి షాఆలం-2 నజఫ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ ప్రాంతంలో చాలా అణచివేత జరిగిందని అన్నారు. అనంతరం 1857 తిరుగుబాటు సమయంలో... రాజానహర్ సింగ్ పోరాడి తిరిగి ఈ ప్రాంతాన్ని దిల్లీ ప్రావిన్స్‌లోకి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుండి ఎంపీ పర్వేశ్ వర్మ సహా తాము నజాఫ్‌గఢ్ పేరును నహర్‌ఘర్‌గా మార్చేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఈ మార్పు చాలా ముఖ్యమని, ముస్లింల హయాంలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, ఈ ప్రాంత రాజులు వారి ఉనికి కోసం పోరాడారని అన్నారు.

వికసిత్ భారత్‌తో ప్రజల జేబులు ఖాళీ

మోదీ సర్కారుపై ఖడ్గే విమర్శలు



న్యూఢిల్లీ: మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్ ద్వారా దేశ ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని ఆరోపించారు. కొందరు సంపన్నుల ఖజానా నింపుతోందన్నారు. ఖర్చు చేసేందుకు కోట్లాది మంది ప్రజల వద్ద అదనపు ఆదాయం లేదని ఖడ్గే చెప్పారు. భారత్ సుంకాలు, వాణిజ్య అడ్డంకులను ఎదుర్కొంటోందని ఆయన వ్యాఖ్యానించారు. 'మోదీజీ... ఖర్చు చేయడానికి కోట్లాది భారతీయులకు అదనపు ఆదాయం లేదు. దేశ జీడీపీలో 60 శాతం ప్రజలు ఖర్చు చేయడంపైనే ఆధారపడి ఉంది. కానీ, దేశంలో 10 శాతం మంది మాత్రమే ఆర్థిక వృద్ధి, వినియోగాన్ని పెంచుతున్నారు. మిగిలిన 90 శాతం మంది నిత్యం అవసరమయ్యే వస్తువులను కొనుగోలు చేయలేకపోతున్నారు' అని 'ఎక్స్' వేదికగా ఖడ్గే పేర్కొన్నారు. 'పన్ను చెల్లిస్తున్న ప్రజల్లో 50 శాతం మందికి దశాబ్ద కాలంలో వేతన పెరుగుదల ఆగిపోయింది. గ్రామీణ వేతనాల పెరుగుదలలోనూ అంతే. కేంద్రంలోని ఎన్డీయే విధానాలు అందరి ఆదాయాలు పెంచడంలో విఫలమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ సుంకాలతో పోరాడుతోంది. వాణిజ్యంలోనూ అడ్డంకులున్నాయి. నిరుద్యోగం ఊబిలో యువత చిక్కుకుపోయింది. ద్రవ్యోల్బణం పీడిస్తోంది. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదు. మీరు చెబుతున్న వికసిత్ భారత్ సాధారణ ప్రజల జేబులు ఖాళీ చేస్తోంది. కొంతమంది సంపన్నుల ఖజానా నింపుతోంది' అని మల్లికార్జున ఖడ్గే విమర్శించారు.

ట్రంప్ ఎదుట నోరెత్తని మోదీ

న్యూఢిల్లీ: అమెరికా వస్తు, సామాగ్రిపై సుంకాలు తొలగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ నాశనం అవుతుందని కాంగ్రెస్ నేత అజయ్ కుమార్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల విధానాన్ని మోదీ ప్రభుత్వం ఎండగట్టాలన్నారు. అజయ్ కుమార్ గురువారం విలేకరుల సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో ట్రంప్ భేటీకి సంబంధించిన వీడియోలు ప్రదర్శిస్తూ... మోదీ తీరును ఆక్షేపించారు. ట్రంప్‌ను మాక్రాన్ తప్పుపట్టడం ఆ వీడియోల్లో కనిపించింది. ట్రంప్‌తో భేటీ అయినప్పుడు మన దేశాన్ని దూషిస్తున్నా మోదీ నోరు మెదపలేదని విమర్శించారు. 'భారత్‌ను సుంకాల వసూలీ దేశమని చెబుతూ తిరిగి సుంకాలు విధిస్తామని ట్రంప్ అన్నారు.

భారత్‌ను పదేపదే అవమానించే ప్రయత్నం చేశారు. మోదీ మాత్రం ఎదురు చెప్పలేదు. ఆయనను ఆక్షేపించలేదు. ఆపిల్స్‌పై సుంకాలు తొలగిస్తే హిమాచల్ ఆపిల్ వర్తకులు నష్టపోతారు. ద్రాక్షపై సుంకం ఎత్తివేస్తే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రపై దాని ప్రభావం పడుతుంది. వాహనాలపై సుంకాలు తొలగిస్తే కార్ల మార్కెట్ కుదేలవుతుంది' అని అజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ట్రంప్ విధానం వల్ల జీడీపీ 0.5-0.6శాతం మేర తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ... ఆర్థిక వ్యవస్థకు శత్రువని అజయ్ దుయ్యబట్టారు.

చెరకు తోటలో దాక్కున్న నిందితుడు

జాగిలాలు, డ్రోన్లతో పోలీసుల గాలింపు

పూణె: మహారాష్ట్రలోని పూణెలో పార్కింగ్ చేసిన బస్సులో యువతిపై అత్యాచారం చేసి పరారైన నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అతడు ఓ చెరకు తోటలో దాక్కున్నట్లు సమాచారం అందడంతో డ్రోన్లు, జాగిలాలతో అన్వేషణ సాగిస్తున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. పూణెలోని పోలీస్ స్టేషన్‌కు దాదాపు 100 మీటర్ల దూరంలో నిత్యం రద్దీగా ఉండే స్వర్‌గేటు బస్టాండ్ వద్ద 26 ఏళ్ల యువతిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఈ దారుణంపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు 13 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఎనిమిది క్రైమ్ బ్రాంచ్ బృందాలు ఉన్నాయి. తాజాగా నిందితుడి ఫొటో విడుదల చేసిన పోలీసులు... అతడి ఆచూకీ చెప్పిన వారికి రూ.లక్ష రివార్డు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నిందితుడు దాక్కొని ఉన్న ప్రదేశంలో చెరకు పంట విస్తారంగా ఉండటంతో పోలీసులు జాగిలాలు, డ్రోన్లను వినియోగించారు. చెరకు మొక్కలు 10 అడుగుల ఎత్తు వరకు పెరగడంతో కాలినడకన వెతికేందుకు కష్టంగా ఉండటంతో డ్రోన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. నిందితుడు దత్తాత్రేయ రాందాస్ కూరగాయల ట్రక్కులో దాక్కొని పోలీసుల నుంచి తప్పించుకొని స్వస్థలానికి వెళ్లి... అక్కడ దుస్తులు, బూట్లు మార్చుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అతడి కుటుంబ సభ్యులు, తెలిసిన వారితోనూ మాట్లాడినట్లు సమాచారం. మరోవైపు, నిందితుడు ఉన్న లొకేషన్ తెలిసిందని మంత్రి యోగేశ్ కదం తెలిపారు. యువతిపై దారుణానికి పాల్పడిన నిందితుడిని వదలిపెట్టేది లేదని డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు. బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు. మరణ శిక్షే సరైందంటూ మరో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలను సమర్థించారు.

కఠినచర్యలు అవసరం: జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని పూణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం. మహిళల కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలి. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని కలిగించాలి. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా బాధ్యత ఉంది' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.

ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగు: స్టాలిన్

చెన్నై: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, తమిళనాడులోని అధికార డీఎంకే మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం దేశంపై రుద్దాలనుకుంటున్న త్రిభాషా సూత్రంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందీ కారణంగా 25 ఉత్తర భారతీయ భాషలు కనుమరుగైపోతున్నాయని విమర్శించారు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన ఈ పోస్టు పెట్టారు. 'ఇతర రాష్ట్రాల సోదర, సోదరీమణులారా... హిందీ కారణంగా ఎన్ని భారతీయ భాషలు కనుమరుగయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా? వందేళ్లలో ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, చత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురుచూస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ హిందీ రాష్ట్రాలు కావు. వాటి అసలు భాషలు గతంలో కలసిపోయాయి. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నాం. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారు' అని స్టాలిన్ విమర్శించారు. జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాష నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. తమిళభాషకు, రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ పేర్కొన్నారు. దీనిపై కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది.

అసౌకర్యానికి గురైతే క్షమించండి

కుంభమేళా భక్తులకు మోదీ అభ్యర్థన

న్యూఢిల్లీ: 'మహాకుంభమేళా' ఘనంగా ముగియడంతో 45 రోజుల పాటు సాగిన కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే... క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉంది' అని మోదీ పేర్కొన్నారు. మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ వేడుకున్నారు.

అసెంబ్లీ ఎదుట ఆప్ ఎమ్మెల్యేల నిరసన

బారికేడ్లతో అడ్డుకుంటున్నారు: ఆతిశీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత ఆతిశీ సహా సస్పెన్షన్‌కు గురైన ఆప్ ఎమ్మెల్యేలు గురువారం దిల్లీ అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. తమను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా భద్రతాబలగాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. బారికేడ్లతో ప్రధాన ప్రవేశద్వారాన్ని మూసివేశారని అన్నారు. దిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ నియంతృత్వం హద్దులు దాటిపోయిందని ఆతిశీ మండిపడ్డారు. తమను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. జై భీమ్ నినాదాలు చేసినందుకే తమను మూడు రోజుల పాటు సభ నుండి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ఆవరణలోకి కూడా అనుమతించడం లేదని, దిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని అన్నారు. సస్పెన్షన్‌కు గురయ్యారంటూ ఎన్నికైన సభ్యులను అసెంబ్లీ ఆవరణలోకి కూడా అనుమతించలేదని ఆప్ ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ సర్కారు అడ్డుకోవడంపై ఆతిశీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'బీజేపీ నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. దిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు' అని ఆమె దుయ్యబట్టారు. మద్యం కుంభకోణంపై కాగ్ నివేదికను నిరసిస్తూ ఇటీవల ఆప్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే.

దీంతో ఆతిశీ సహా 21 మంది ప్రతిపక్ష సభ్యులను మూడు రోజుల పాటు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఆతిశీ సహా పలువురు ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్దకు రాగా... పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ ఉత్తర్వుల కారణంగా లోనికి వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. దీంతో మాజీ సీఎం వారితో వాగ్వాదానికి దిగారు.

కోమాలో భారతీయ విద్యార్థిని

కేంద్రం చొరవతో వీసా ఇంటర్వ్యూకు అమెరికా ఓకే

న్యూఢిల్లీ: కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబం అభ్యర్థనపై అమెరికా నుంచి స్పందన వచ్చింది. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూకు అమెరికా అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్లాట్ కేటాయించింది. వీసా కోసం బాధితురాలి తండ్రి చేస్తోన్న ప్రయత్నాలు తమ దృష్టికి రావడంతో భారత విదేశాంగ శాఖ అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపింది. దీంతో అమెరికా సానుకూలంగా స్పందించింది. కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబానికి సహాయం అందించేందుకు కేంద్రం ప్రభుత్వం ముందుకొచ్చింది. బాధితురాలి తండ్రి ఆవేదన తమ దృష్టికి రావడంతో అమెరికా ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా లేక అత్యవసర ప్రయాణానికి అనుమతి ఇవ్వాలంటూ భారత విదేశాంగశాఖకు చెందిన అమెరికా విభాగం అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించింది. కాలిఫోర్నియా యూనివర్సిటీలో పీజీ చేస్తోన్న నీలమ్ షిండే ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. కారు ఢీకొనడంతో షిండే తల, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉంటున్న ఆమె కుటుంబానికి ఫిబ్రవరి 16న ఈ విషయం తెలిసింది. నీలమ్ తండ్రి వెంటనే వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా... అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే చేసిన సోషల్ మీడియా పోస్టు ద్వారా ఆ కుటుంబం ఆవేదన అందరి దృష్టికి చేరింది. 'నీలమ్ షిండే అనే విద్యార్థి అమెరికాలో ప్రమాదానికి గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి ప్రయత్నిస్తున్నారు. ఆయన అత్యవసర వీసా కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఆయనకు సహాయం చేయాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, భారత దౌత్య కార్యాలయాన్ని కోరుతున్నా' అని ఎంపీ సుప్రియా సూలే ఎక్స్ వేదికగా కోరారు.

నిద్ర కూడా ముఖ్యమే: హైకోర్టు

బెంగళూరు: పని మాత్రమే కాదు... నిద్ర కూడా ముఖ్యమే... విధి నిర్వహణలో ఒక ఉద్యోగి నిద్రపోవడం తప్పెలా అవుతుంది... సామర్థ్యానికి మించిన పని అప్పగించినప్పుడు మనిషికి విశ్రాంతి కచ్చితంగా అవసరమని కర్నాటక హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో డ్యూటీలో నిద్రపోయి సస్పెండ్ అయిన ఓ కానిస్టేబుల్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జస్టిస్ ఎం. నాగప్రసన్న ధర్మాసనం తీర్పునిచ్చింది. వివరాలివి. గత ఏడాది మార్చి 23న కల్యాణ్ కర్నాటక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో పని చేసే చంద్రశేఖర్ అనే కానిస్టేబుల్ నిద్రపోతున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయింది. ఈ ఘటనపై ఆయనను ఉన్నతాధికారులు వివరణ కోరారు. వరుస షిఫ్టులలో డ్యూటీ చేయడం వల్ల తన ఆరోగ్యం బాగా దెబ్బతిందని, వైద్యుల సలహా మేరకు మందులు వాడుతున్నానని, వాటి మూలంగానే నిద్ర ముంచుకొచ్చిందని, అయినా తాను 10 నిమిషాలపాటే విశ్రాంతి తీసుకున్నానని వివరణ ఇచ్చాడు. అయితే అతడి వివరణతో అధికారులు సంతృప్తి చెందలేదు. డ్యూటీలో ఉండగా పడుకోవడం తప్పేనని, పైగా ఈ చర్యలో డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందని చెబుతూ సస్పెండ్ చేశారు. విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో సస్పెన్షన్‌పై ఆయన హైకోర్టుకు ఆశ్రయించారు. అయితే... సదరు విభాగంలో ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారని, వరుసగా మూడు షిఫ్టులలో పని చేస్తున్నారని... కాబట్టి వారిపై పని ఒత్తిడి తగ్గించడానికి మరో ఇద్దరిని నియమించాల్సిన అవసరం ఉందని విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ... యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్టికల్ 24 ప్రకారం... ప్రతీ ఉద్యోగికి విశ్రాంతి హక్కు ఉంటుంది. వేతనంతో కూడిన కాలానుగుణ శెలవులు తీసుకునే హక్కు కూడా ఉంటుంది. అంతర్జాతీయ కార్మిక సంఘ ఒప్పందాల ప్రకారం... ప్రతీ ఉద్యోగికి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ తప్పనిసరి. షిఫ్టులవారీగా పని చేసేవాళ్ల విషయంలో ఇది మరీ అవసరం. అసాధారణ సందర్భాలను మినహాయిస్తే.. రోజుకి ఎనిమిది గంటలు... వారంలో 48 గంటలకు పని గంటలు మించకూడదు. ఈ కేసులో పిటిషనర్ విధుల్లో నిద్రపోవడంలో ఎలాంటి తప్పిదం కనిపించడం లేదు. వరుస షిఫ్టులలో 16 గంటలపాటు పని చేయడం మూలంగా ఆయన అధిక పని ఒత్తిడితో ఇబ్బంది పడ్డారు. అందుకే నిద్రపోయారు. కాబట్టి, సస్పెన్షన్ సరికాదు. తిరిగి ఆయన్ని విధుల్లోకి తీసుకోవాలి అని జస్టిస్ ఎం నాగప్రసన్న ఆదేశాలు జారీ చేశారు.

పాత కక్షలతో రెజ్లర్ హత్య

చండీగఢ్: శివరాత్రిని పురస్కరించుకుని జాతరలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఓ రెజ్లర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన హర్యానా రాష్ట్రం ఖర్ఖోడా జిల్లా కుండల్ గ్రామంలో జరిగింది. తూపాకీ కాల్పుల్లో మృతిచెందిన రెజ్లర్ (35)ను రాకేశ్‌గా గుర్తించారు. అతడు సోతి గ్రామస్థుడు. రోహ్‌తక్‌లో కుటుంబంతో జీవిస్తున్నాడు. సోతిలో అతడు ఓ రెజ్లింగ్ అకాడమీ నిర్వహిస్తున్నాడు. కుటుంబానికి చెందిన పాత కక్షలే అతడిని బలి తీసుకున్నట్లు రెజ్లర్ రాకేశ్ మామ చాంద్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమి వివాదం అంశంలో మనోజ్ అనే వ్యక్తితో గొడవలు ఉన్నాయని, గతంలోనూ మనోజ్ మరో వ్యక్తితో కలిసి రాకేశ్‌పై దాడిచేసినట్లు చెప్పాడు. శివరాత్రి రోజు రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు తన కుమారుడు అమృత్, ఇతర ఆటగాళ్లతో కలిసి రాకేశ్ వెళ్లాడు. కొడుకు అమృత్ బౌట్ ముగిసిన తర్వాత కారు ఎక్కేందుకు వెళ్తున్న సమయంలో... రాకేశ్‌పై దాడి జరిగినట్లు ఫిర్యాదు చేశారు. మనోజ్, సాహిల్... పిస్తోళ్లతో రాకేశ్‌పై కాల్పులు జరిపారు. ఆ సమయంలో రోడ్డుపైకి పరుగెత్తేందుకు అతను ప్రయత్నించాడు. అతడి వెనుక పరుగులుతీస్తూనే రాకేశ్‌ను కాల్చారు. బుల్లెట్ గాయాలైన అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాకేశ్ శరీరంలోకి ఎనిమిది బుల్లెట్లు దిగాయి. సోనిపట్ సివిల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఎన్నటికీ మమతకు విధేయుడినే

- మరో ఏక్‌నాథ్‌షిండే కాబోను
- 2026లో టీఎంసీ గెలుపే ధ్యేయం
- అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా: నా గొంతు కోసినా పార్టీకి ద్రోహం చేయనని, ఎన్నటికీ అధినాయకురాలు మమతాబెనర్జీకి విధేయుడిగానే ఉంటానని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ స్పష్టం చేశారు. 2026లో జరిగే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఇక్కడి నేతాజీ ఇండోర్ స్టేడియంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... "నేను మీమాన్ (ద్రోహి) కాదు. నా గొంతు కోసినా...నేను మమతా బెనర్జీ జిందాబాద్ అని చెబుతాను. ముకుల్ రాయ్, సువేందు అధికారి వంటి ద్రోహులను నేను గుర్తించాను. నేను కొత్త పార్టీని ప్రారంభిస్తానని వారు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారు. నేరు మరో ఏక్‌నాథ్‌షిండేను కాబోను" అన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో సీబీఐ ఛార్జ్‌షీట్‌ను ప్రస్తావిస్తూ... అవన్నీ అబద్ధాలేనన్నారు. సీబీఐ బీజేపీ స్వరంలో అస్పష్టమైన సూచనలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీకి సీబీఐ, ఈడీ, ఐటీ ఉన్నాయి కానీ వాటికి మా పార్టీ కార్యకర్తలకు ఉన్నంత ధైర్యం లేదని అభిషేక్ అన్నారు. పార్టీలో సంస్థాగత మార్పులను అధినాయకురాలు మమత విస్మరించడం పట్ల తాను అసంతృప్తిగా ఉన్నానని అభిషేక్ అన్నారు. తన ప్రసంగం ప్రారంభంలోనే కార్యకర్తలతో మాట్లాడుతూ, చాలా కాలంగా వారిని కలిసే అవకాశం తనకు రాలేదని అన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు తృణమూల్ కాంగ్రెస్ 215 సీట్లు గెలిచి తీరాల్సిందేనని అభిషేక్ లక్ష్యం నిర్దేశించారు. 'అసెంబ్లీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ... మేము మూడింట రెండు వంతుల మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తాం అన్నారు. అంటే దాదాపు 194-195 సీట్లు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మేము 214 సీట్లు గెలుచుకున్నాం. వచ్చే ఏడాది గత ఎన్నికల కంటే కనీసం ఒక సీటు ఎక్కువగా గెలవాలి' అన్నారు. పార్టీలో అంతర్గత పోరు, వర్గపోరాటాలకు పాల్పడుతున్న పార్టీ నాయకులకు హెచ్చరికలు చేశారు. 'మీ విభేదాలు మర్చిపోండి. వాట్సాప్ గ్రూప్ రాజకీయాల్లో మునిగిపోయే వారు పార్టీకి సహాయం చేయడం లేదు. అధికారాన్ని మీ దగ్గర ఉంచుకోకండి, ప్రభుత్వ సంక్షేమ విధానాలతో ప్రజల వద్దకు వెళ్లండి' అని ఆయన హితవు పలికారు. బుధవారం టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్టీ సమావేశంలో మాట్లాడుతూ... ఎవరి పేరు ప్రస్తావించకుండా అవినీతి చర్యలతో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారు రఘు దకత్ లాంటివారని అన్నారు.

'మొత్తం కుటుంబ సభ్యులందరూ దొంగలే... ఇద్దరు లేదా ముగ్గురు దొంగల వల్లే మొత్తం పార్టీ ప్రతిష్ఠ మసకబారింది' అని మహువా నదియా జిల్లాలోని పలాశిపారాలో అన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణానికి సంబంధించి తృణమూల్ ఎమ్మెల్యే మాణిక్ భట్టాచార్యను అరెస్టు చేసిన ప్రదేశం ఇది.

ఈసీ ముందు నిరవధిక దీక్ష చేస్తా: మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాలు ప్రత్యేకించి హర్యానా నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో బీజేపీ చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన మమత... భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హర్యానా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ బీజేపీ ఈ తరహా వ్యూహాలు అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని బీజేపీకి తెలుసునని, అందుకే తప్పుడు జాబితా రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (బీజేపీ) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

హైదరాబాదులోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కార్మికుడు, ప్రజా కవి జయరాజు పదవి విరమణ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె.షాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రమావత్ అంజయ్య నాయక్, న్యాయవాది ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
విశాలాంధ్ర-హైదరాబాద్

భూగర్భ పైపులైన్, మంచినీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతం నగర్ డివిజన్‌లోని వేసవికాలంలో గౌతమ్ నగర్, వాణి నగర్, ఏకలవ్య నగర్, యాదవ నగర్ తదితర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ సమస్యలు, మంచినీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఖైరతాబాద్ జలమండలి జీఎం అశోక్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ వేసవి కాలంలో గౌతమ్ నగర్ డివిజన్‌లో మంచినీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. గౌతమ్‌నగర్ డివిజన్ ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారని తెలిపారు. గౌతమ్ నగర్ డివిజన్లో అన్ని కాలనీలలో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేసి ఉపయోగంలో లేని బోర్ వెల్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్. నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ బోర్‌కు మరమత్తు చేయించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్ రాఘవేంద్ర స్వామి దేవాలయం వద్ద స్థానికులు పవర్ బోర్ పాడైయిందని మరమత్తు చేయించాలని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి బోర్ మరమ్మతులు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి డీ.జీ.ఎం రమేష్, మేనేజర్ నవీన్, నాయకులు బాబు, కిషోర్, బ్రహ్మయ్య, స్థానికులు మనసుధన్, జగన్నాద్, కులకర్ణి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

నాగ సాధువులచే శివుని విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - ఆమనగల్లు : తలకొండపల్లి మండల కేంద్రం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పురాతనమైన శివాలయ పునర్నిర్మాణం చేసి ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని, ఆలయాన్ని హిమాలయాలకు చెందిన నాగ సాధువులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివ నామస్మరణతో ఆధ్యాత్మిక శుద్ధి, మనశ్శాంతి కలగడమే కాక జీవితంలో సుఖశాంతులు పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో గాంధీ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా హఫీజ్పెట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్పెట్‌లో గల శివాలయం దేవాలయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, పరమేశ్వరునికి అభిషేకం చేసి, అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం అతి పవిత్ర దినం. శివుడికి అత్యంత ఇష్టమైన రోజు, శివరాత్రి నాడు వాడ వాడల రోజు వారీ ఉపవాస దీక్షలతో, జాగారంతో వేడుక చేసుకుంటారు. ఆ పరమశివుడిని ఆరాధిస్తూ పర్వశించే పవిత్ర రోజు మహాశివరాత్రి రోజు అని, ఉపవాసాలు, జాగరణలతో ఎంతో భక్తి శ్రద్ధలతో ఆ మహా శివున్ని కొలిచే పర్వదినం మహా శివరాత్రి ప్రజలందరిపై ఆ మహాదేవుని కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనసారా ప్రార్థిస్తూ.. మహాశివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రకాష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వైద్య వృత్తి పవిత్రమైనదని వచ్చే పేషంట్స్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం గవర్నమెంట్ నిజామీయా తిబ్బి కళాశాల, జనరల్ ఆసుపత్రిని చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫీకర్ అలీతో కలసి కళాశాల, ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని ఆ దిశగా అన్ని విభాగాల వైద్యులు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి, కళాశాల ఆవరణలో ఐదు పురాతన భవనాలను తొలగించే ప్రక్రియపై కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అత్యంత సౌకర్యాలతో అద్భుతమైన ఆసుపత్రి నిర్మాణం అలాగే వైద్య విద్యార్థుల వసతిగృహం చేపట్టడానికి ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. హెరిటేజ్ కిందకు వచ్చే పురాతన భవనాల రెనోవేషన్ చేపట్టిందుకు గాను రూ.10 కోట్లు అలాగే నూతన ఆసుపత్రి భవనం, హాస్టల్ నిర్మాణం అలాగే క్యాంటీన్ సదుపాయాలు కల్పించడంకై రూ.42 కోట్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాత భవనాల తొలగింపు ప్రక్రియ నిబంధనల మేరకు జరగాలని, భవనాల తొలగింపు తదుపరి భూమి విస్తీర్ణం వివరాలను అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి వసతి గృహం కూడా తొలగింపులో ఉన్నందున వైద్య విద్యార్థులకు చార్మినార్ పరిసర ప్రాంతంలో తాత్కాలిక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బియుఎంఎస్ వైద్య విద్యార్థులకు ఫలక్నుమా ప్రాంతంలో రెండు ఎకరాలలో వసతి గృహం ఏర్పాటుకు నివేదికలు అందచేయాలనీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తదుపరి ఆసుపత్రి పరిసర ప్రాంతాలతో పాటు ఓ.పి. బ్లాక్‌ను శాసనసభ్యులతో కలసి సందర్శించి ఓ.పి వివరాలను, పేషంట్స్‌కి అందుతున్న మెడిసన్ అలాగే వైద్యసేవలను అడిగి పలు విభాగాలను ఈ సందర్భంగా తనిఖీ చేసి అందుతున్న వైద్య సేవలపై పేషెంట్లతో తెలుసుకున్నారు. కళాశాలలో లైబ్రరిని సందర్శించి పురాతనమైన ఉర్దూ, ఫార్సీ భాషలో గల వైద్య పుస్తకాలను పరిశీలించి వైద్య విద్యార్థులతో అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. అదేవిదంగా ఫిజియోథెరపీ విభాగాన్ని సందర్శించి డాక్టర్ సిద్ధిఖి అందించిన పలు పరికరాలను పరిశీలించి అభినందించారు. హెచ్‌డిసి కమిటీ నిధులతో ఫిజియోథెరపీ డాక్టర్‌ను నియమిస్తామని పేషెంట్లకు మెరుగైన వైద్యం అందుతుందని ఈ సందర్భంగా అన్నారు. గర్భినులకు వైద్య సదుపాయాలు నిరంతరం అందాలని అలాగే సాధారణ ప్రసావాలు ఎక్కువగా జరిగేలా ప్రత్యేక కృషి చేయాలని, కళాశాలలో వైద్య విద్యార్థుల వివరాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని వచ్చే పేషంట్ల దృష్ట్యా వైద్యుల్ని, సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ను ప్రిన్సిపాల్ అభ్యర్థించగా నివేదికను అందచేస్తే డి.ఎం.ఈ కి పంపించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షైజాదీ సుల్తానా, ఆసుపత్రి సూపరింటెండెంట్ వసంతరావు, ప్రెసిడెంట్ యుఎంఓఏ డ్రా. హైదర్ యమని, కార్పొరేటర్ సోయబ్ ఖాద్రి, తహసీల్దార్ చంద్ర శేఖర్, ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్.ఎల్.బి.సి) సొరంగంలో ఒక భాగం ఫిబ్రవరి 22న కూలిపోయింది. ఎనిమిది మంది కార్మికులు సొరంగం లోపల చిక్కుకున్నారు. భారత సైన్యం, నేవీ, ర్యాట్ మైనర్లు మరియు ఎన్.డి. ఆర్.ఎఫ్ బృందాల సహాయంతో రాష్ట్ర ప్రభుత్వ బృందాలు లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి విస్తృతమైన కార్యకలాపాలను చేపట్టాయి. ఈ విషయంలో, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, ఆ ప్రదేశంలో సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్న ఉక్కు, ఇనుము శిథిలాలను తొలగించడం ద్వారా రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయం కోసం దక్షిణ-మధ్య రైల్వే సహాయాన్ని కోరారు. దక్షిణ-మధ్య రైల్వే వెంటనే ఈ పిలుపుకు స్పందించి, రెస్క్యూ మిషన్‌లో సహాయం చేయడానికి మెటల్ కటింగ్ నిపుణులతో కూడిన రెండు బృందాలను నియమించింది. దక్షిణ-మధ్య రైల్వే డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, శ్రీ ఎస్.మురళి, ఐ.ఆర్.ఎస్. ఏం.ఈ నేతృత్వంలోని మొదటి బ్యాచ్, సికింద్రాబాద్, లాలా గూడ, రాయనపాడు వర్క్‌షాప్‌ల నుండి 01 సీనియర్ సెక్షన్ ఇంజనీర్, 13 మంది వెల్డర్లు, ఇద్దరు టెక్నీషియన్లు సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన పనులను చేపట్టారు. మొదటి బృందానికి మద్దతుగా ఒక సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌తో పాటు నలుగురు టెక్నీషియన్లతో కూడిన రెండవ బ్యాచ్ నిపుణులు కూడా సంఘటన స్థలానికి చేరుకుంటారు. సిబ్బందితో పాటు అవసరమైన యంత్రాలు అంటే 01- ప్లాస్మా కటింగ్ మెషిన్, 01- బ్రోకో కటింగ్ మెషిన్ మరియు వినియోగ వస్తువులు, 01- పోర్టబుల్ ఎయిర్ కంప్రెసర్, 06- ప్లాస్మా కట్టర్లు, 01- అల్ట్రా థర్మిక్ కటింగ్ పరికరాలు, 20 ప్యాకెట్లు-ఎలక్ట్రోడ్లు, 01-బ్యాటరీ, 06-ఆక్సిజన్ సిలిండర్లు, 02-వెల్డింగ్ మెషిన్, 04 ప్యాకెట్లు-వెల్డింగ్ ఎలక్ట్రోడ్‌లు, హెల్మెట్లు మరియు రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లు పంపబడ్డాయి. ప్రస్తుతం, దక్షిణ మధ్య రైల్వే శిథిలాల తొలగింపు, కార్మికులను రక్షించడం, ఉపశమనం అందించడం వంటి కార్యకలాపాలను వేగవంతం చేయడంలో ముందంజలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి : కమిషనర్

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ప్రజలంతా సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు చెల్లించి తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నులు చెల్లించని వారు త్వరగా చెల్లించాలని, లేనియెడల జరిమానాలు తప్పవన్నారు. వ్యాపారస్తులు వ్యాపార లైసెన్సులను పునరుద్ధరించుకోవాలని, 2025-26 ఆర్థిక సంవత్సరం వ్యాపార లైసెన్సులను మార్చి 31వ తేదీ లోపు చెల్లించాలని కోరారు. సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులను చెల్లించడం ద్వారా మున్సిపాలిటీలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. తద్వారా మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చి దిద్దవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ బిక్షపతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

14 నెలలుగా విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయి?

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 14నెలలు అవుతున్నా విచారణ సంస్థలు ఇప్పటి వరకు ఒక్క హవాలా వ్యక్తిని కూడా పట్టుకోలేదని పేర్కొన్నారు. డ్రగ్స్ దందాలో సినీ ప్రముఖుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతోందని వివరించారు. కావున ఇప్పటికైన హవాలా దందాపై యాక్షన్ తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో కేదార్ మృతి రాష్ట్రంలో సంచలనంగా మారిందన్నారు. కేదార్ జూబ్లీహిల్స్‌లో గతంలో పబ్‌లను నడిపిన వ్యక్తి అని ఆయన గతంలో డ్రగ్స్ కేసులో దొరికిండన్నారు. ఆయనతో పాటు డ్రగ్స్‌లో ఉన్న వ్యక్తులు ఎవరో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో సంపాదించిన అక్రమ సంపాదన వేల కోట్లు దుబాయ్ తరలించబడ్డవని, ఈ అక్రమ డబ్బులు ఎవరు దుబాయ్‌కి తరలించారో ప్రజలకు తెలియాలన్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న బినామిలు ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియాలని, వెలకోట్లు విదేశాలకు తరలిపోతుంటే రాష్ట్రంలో విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. అదే సమయంలో సినీ ప్రముఖులు బ్రాండ్ అంబాసిడర్ పేరుతో సంపాదించిన సొమ్ము విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చీటర్స్ చేతిలో సూపర్ స్టార్స్ మోసపోతున్నారని, వారు సంపాదించిన సొమ్ముతో కొంత తెలంగాణకు కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తుందని, మీ సంపాదనలో కొంత తెలంగాణ విద్యానిధికి కేటాయించాలన్నారు. తెలంగాణ పిల్లల భవిష్యత్తును అందంగా తీర్చి దిద్దాదానికి సహకరించండని సూచించారు. ఇప్పటికైన యాక్షన్ తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

బాస్ వాలా చేతికి ఫ్రీడం యాప్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రముఖ పెట్టుబడిదారుడు, వ్యాపారవేత్త, బాస్ వాలా అధినేత శశి రెడ్డి ఆధ్వర్యంలోకి ఫ్రీడం యాప్ వచ్చింది. ఈ యాప్ ఒక ఎడ్టెక్ ప్లాట్ఫారమ్. ఇది సువిజన్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచేది. ఇందులో బాస్ వాలా ఏడు మిలియన్ డాలర్లు (సుమారు 60 కోట్లు) పెట్టుబడి పెట్టింది. ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా బాస్ వాలా వ్యవస్థాపకుడు, సీఈఓ శశి రెడ్డి మాట్లాడుతూ ఈ ఫ్రీడం యాప్ ద్వారా లభించే ఉపాధి ఆధార విద్యా కంటెంట్తో పాటు బాస్ వాలా వివిధ వ్యాపార రంగాల్లో వేల మంది నిపుణులను అందుబాటులోకి తెస్తుందన్నారు. టైర్ 2, టైర్ 3 పట్టణాల్లో వ్యాపారం ప్రారంభించాలని అనుకునే వ్యక్తులకు అవసరమైన వనరులు అందించనుందన్నారు.

విజయవంతమైన వ్యాపారం నిర్మించేందుకు సహాయపడుతుందని తెలిపారు. జేఈఈ, ప్రభుత్వ పరీక్షల కోసం ఎన్నో ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయన్నారు. కానీ ఉపాధి కల్పించే, ఆదాయాన్ని అందించేవి లేవన్నారు. బాస్ వాలా ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు వచ్చిందన్నారు. వ్యాపార విద్యా, మార్గదర్శకత అందించే సమగ్ర వేదికగా బాస్ వాలా ఉంటుందన్నారు. బాస్ వాలా పెట్టుబడితో వేలాది మంది వ్యాపారవేత్తలు తమ వ్యాపారాన్ని ప్రారంభించడానికి, అభివృద్ధి చేసుకోవడానికి, అవసరమైన నైపుణ్యాలను పొందడానికి, మార్గదర్శకత అందుకోవడానికి సమగ్ర వేదికను అందించనుందని తెలిపారు. ఈ ప్లాట్ఫారమ్ ప్రారంభంలో డిజిటల్ వ్యాపారాలు, గృహాధారిత వ్యాపారాలు, చిన్నతరహా తయారీ, హస్తకళలు, వ్యవసాయం, పశుపోషణ, రిటైల్, ఫుడ్ వ్యాపారాలు వంటి 12 ప్రధాన విభాగాల్లో నైపుణ్యాలను అందించేందుకు దృష్టి పెట్టిందన్నారు. ప్రధానంగా తక్కువ పెట్టుబడితో ఇద్దరు లేదా ముగ్గురికి ఉపాధి కల్పించేవన్నారు. చిన్న చిన్న పట్టణాల్లో ఆదాయం పొందడానికి అనుకూలమైన వ్యాపారాలు ఇవన్నారు. పెద్ద నగరాలకు వలస వెళ్లకుండానే మంచి ఆదాయాన్ని పొందే అవకాశాన్ని ఇవి అందిస్తాయన్నారు.

భవన నిర్మాణాల అనుమతులు ఇక వేగవంతం

కమీషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇక నుండి భవన నిర్మాణాల అనుమతులు వేగవంతంగా జరుగుతాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అన్నారు. గురువారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ రూపొందించిన బిల్డ్ నౌ పై జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ బిల్డ్ నౌ అప్లికేషన్ అప్లోడ్ చేసే విధానంపై పలువురికి శిక్షణ కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మార్చి 9 వరకు నిర్వహించి, మార్చి 10వ తేదీ నుండి బిల్డ్ నౌ అప్లికేషన్ ప్రారంభించే అవకాశం ఉన్నందున జిహెచ్ఎంసి జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు బిల్డ్ నౌ అప్లికేషన్ అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీతో రూపొందించబడిన నేపథ్యంలో ప్లాన్‌లో అప్లోడ్ చేసే సమయంలో అందులో ఉన్న లోపాలను గుర్తిస్తుందని, మొత్తం ప్లాన్ మొదటి నుండి పరిశీలించాల్సిన అవసరం ఉండదని, గుర్తించిన అంశాన్నే సవరించి అప్లోడ్ చేసే వెసులుబాటు ఉందని అన్నారు.

అప్లికేషన్ పరిశీలన చేసే సందర్భంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా ప్లాన్, చెరువు పక్కన ఎంత దూరంలో ఉంది. కోర్టు కేసులు ఉన్నాయా అప్లికేషన్‌లోనే పొందుపర్చడం జరుగుతుందని వివరించారు. వాటిని పరిశీలించి తొందరగా ఇచ్చే అవకాశం ఉంటుందని సైట్ కూడా పరిశీలన చేసే అవకాశం కలదన్నారు. అప్లై చేసే వారు చివరగా కోర్టు కేసులు గాని, ఇతర ఎలాంటి కేసులు లేవని ఏదైనా సమస్య ఉంటే మొత్తానికి నేనే బాధ్యత వహిస్తానని ధృవీకరణ సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసీపీ శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంత్, హేమంత్ కేశవ్ పాటిల్, ఎపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ సిసీపీలు గంగాధర్, ప్రదీప్ వీరన్న టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికిపుచ్చుకోవాలని, చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతిని అఖిల భారత యువజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ ముష్కరుల బానిస సంకెళ్ల నుండి మాతృదేశ విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అతి చిన్న వయసులోనే దేశభక్తిని పెంపొందించుకొని విప్లవ వీర యోధుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని విప్లవం వర్ధిల్లాలి అంటూ నినాదం అందించిన గొప్ప విప్లవ కారుడు చంద్రశేఖర్ ఆజాద్ అని అన్నారు. నేడు దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని, దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఎందరో విప్లవ యోధులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి దేశానికి స్వతంత్రం సాధిస్తే నేటి పాలకులు దేశాన్ని అంగడి సరుకుగా చేసి దేశంలో ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేసి దేశ సంపదను ప్రైవేట్ పరం చేస్తూ నిరుద్యోగుల సంఖ్యను పెంచుకుంటూ పోతున్నారన్నారు. దేశ భవిష్యత్తును మార్చే యువతను పబ్బులు, క్లబ్బులు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు చేసి మద్యం మాదకద్రవ్యాలకు బానిసలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అందుకే దేశంలో జరుగుతున్న విధ్వంసకర పాలనకు వ్యతిరేకంగా చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని దేశభక్తిని నేటి యువత పునికి పుచ్చుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఏఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు కళ్యాణ్, నేతలు అనిల్ కుమార్, వంశీ, బాలు, విజయ్, అరుణ్, లక్ష్మణ్, శరత్, ఏఐటీయూసీ నేత చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర- హైదరాబాద్ : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉండలని, అధికారులు సిబ్బంది సమయ పాలన పాటించాలని అందుకు ఆర్టిఫిషియల్ ఐ (ఏఐ) సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. హెడ్ ఆఫీసులో హెచ్ఓడిలు కూడా అందుబాటులో ఉండేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. జోనల్, డిప్యూటీ కమీషనర్ కార్యాలయాల్లో కూడా సిసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఐటి అడిషనల్ కమీషనర్ ను కోరారు. హెడ్ ఆఫీస్‌లో హెచ్ఓడిలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టి అదేవిధంగా జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు మీరే భాధ్యత కాబట్టి అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించే విదంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

యుజిడి పనులను మంజూరు చేయించాలి

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని నాచారం డివిజన్‌లోని భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మంజూరు చేయించిన పనులకు టెండర్లు పిలవాలని డివిజన్ కార్పొరేటర్ శాంతి సాజన్ శేఖర్ గురువారం జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్‌ను కోరారు. రాష్ట్రంలోనే ఉప్పల్ నియోజకవర్గం ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే డివిజన్లోని దాదాపు అన్ని కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నేటి సమస్య, రోడ్లు పనులను పూర్తి చేశామని కొద్దిపాటి పనిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేకర్ పాల్గొన్నారు.

రాజ్ నారాయణ ముదిరాజ్‌కు సన్మానం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సమాజ సేవలో డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ చేస్తున్న సేవలు అమోఘం అని టీఎన్జీవోస్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జగదీశ్వర్ అన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థ దినోత్సవం వరల్డ్ ఎన్జీవోస్ డే సందర్భంగా నాంపల్లిలోని టీఎన్జీవో సెంట్రల్ ఆఫీసులో డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ సన్మాన సభలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. శాలువా పూలమాల జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. గత 40 సంవత్సరాలుగా ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అయిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సంస్థను స్థాపించి 1985 నుంచి 2025 వరకు నిర్విరామంగా 40 సంవత్సరాలుగా సేవలందిస్తున్నందుకు ఆయన సేవలను గుర్తించి ఈ సన్మానం చేశామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ నిర్వహిస్తూనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందాలని గుర్తు చేశారు. టీఎన్జీఎస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, గుండె, క్యాన్సర్ నివారణ, మాదకద్రవ్యాల వ్యతిరేకం, జాతీయ సమైక్యత, మతసామరస్యం, క్షయ, కాలుష్య నివారణ మొదలగు ఎన్నో కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తూ డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ సేవలను అమెరికా యూనివర్సిటీ వాళ్ళు గుర్తించి ఇటీవల ఆయనకు ఘనంగా అక్కడ అమెరికాలో సన్మానించాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ 2020 సంవత్సరం ఆగస్టులో ఉస్మానియా ఆసుపత్రిలో రిటైర్ అయ్యానని వివరించారు. టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకులు అధ్యక్షులు కార్యదర్శులు తన సేవలను గుర్తించి ఈ సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సన్మానించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

చిన్న పరిశ్రమలు బతకాలంటే

సింగరేణి బొగ్గు ధర తగ్గించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్: బొగ్గు ఆధారిత సిమెంటు, స్పాంజ్, ఐరన్, సిరామిక్స్, ఫార్మా వంటి పరిశ్రమలు నేటి క్లిష్ట మార్కెట్ పరిస్థితుల్లో మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ తన బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొర పెట్టుకున్నాయి. ముఖ్యంగా తమ పరిశ్రమల మనుగడ, తమపై ఆధారపడిన వేల మంది స్థానిక చిరు ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి లేదా ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్చార్జీలతో కలిసి సింగరేణి భవన్‌లో గురువారం సంస్థ నిర్వహించిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో దాదాపు 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కేవలం 5 మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ తెలుసుకున్నారు. దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణితో తమకు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రవాణా సమస్యలు లేకుండానే సింగరేణి నుంచి బొగ్గు తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు. కానీ, పోటీ మార్కెట్లో ఇప్పటికే తాము ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్నందున తాము అంతకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కోలిండియా విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చితే తక్కువకే లభిస్తోందన్నారు. బొగ్గు ధరను తగ్గిస్తే సింగరేణి నుంచి స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను, సింగరేణి మార్కెట్‌ను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలపై సమాలోచనలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. త్వరలో మరొక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) డి.రవి ప్రసాద్, జీఎం(సీపీపీ) మనోహర్, ఓఎస్డీ (మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖర రావు, డీజీఎంలు సురేందర్ రాజు, శ్రీవాస్తవ, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవభారత్, ఐటీసీ, ఓరియంట్ సిమెంట్, అల్ట్రా టెక్ సిమెంట్, దివీస్ ల్యాబరేటరీస్, హెటిరో ఫార్మా, సిర్పూర్ పేపర్ మిల్స్ తదితర సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

వికలాంగుల వికాసానికి కృషి అభినందనీయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మాన్య స్పోర్ట్స్, కల్చరల్ అకాడమీ (ఏ డివిజన్ ఆఫ్ వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని కేబీఆర్ పార్క్‌లో గల వినాయకుని వద్ద పూజలు నిర్వహించామని వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రామగోపాల్ రెడ్డి, ప్రమోద్ సానలు తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బీరంగుల ఉదయ్‌కిరణ్ జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి మాజీ మంత్రి ఎం.వి మైసూరా రెడ్డి, పారిశ్రామికవేత్తలు రాజేంద్ర అగర్వాల్ సురేందర్ అగర్వాల్, స్కేటింగ్ దినేష్ పంచల్ ఫుట్బాల్ కోచ్ మల్లికార్జున్ గౌడ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్ కుమార్ విచ్చేశారు. మానసిక, శారీరక వికలాంగులైన బాలల వికాసానికి కృషి చేస్తున్న వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ముందు ముందు వేసవి శిబిరాల ద్వార హైదరాబాదులోనే కాకుండా ఇతర జిల్లాలో ట్రైనింగ్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. స్కేటింగ్ డ్రాయింగ్ పెయింటింగ్ సంగీతం నాట్యం తదితర అంశాల్లో వారున్నచోటికే నిపుణులు వెళ్లి శిక్షణ ఇప్పించేందుకు మాన్య కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ సన్నాహాలు చేస్తుందన్నారు. ఈ బాలలకు మరింత సేవలు అందించనుంది. రామచంద్రారెడ్డి అగస్త్యా యూఎస్ఏ 50 సంవత్సరాల నుండి నివసిస్తున్నప్పటికీ ఉన్న స్థలాన్ని మర్చిపోకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు భూరి సహాయం అందజేస్తున్నారాని వెల్లడించారు.తన సొంత మహబూబ్నగర్ జిల్లాలో స్వామి వివేకనంద విగ్రహాలు, దేవాలయాలు రెడ్‌క్రాస్ సొసైటీకి, శంకర్ నేత్రాలయాలకు ఎన్నో నిధులు సమకూరుస్తున్నారు. వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న కార్యక్రమాలకు తన సహాయాన్ని అందిస్తానని చెప్పారు. నిజామాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం ఆత్మ చరణ్ రెడ్డి సైతం వికాస పార్టీ చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. మాన్య కల్చరల్, స్పోర్ట్స్ అకాడమీ చేపట్టే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మంత్రాల నెపంతో వీరమ్మను చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మంత్రాలు చేస్తున్నదనే అనుమానంతో సారపాక వీరమ్మను దారుణంగా హత్య చేయడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లమండలం గరిమిళ్ళపల్లి శివారు గ్రామమైన బోయినపల్లికి చెందిన సారపాక వీరమ్మను మంత్రాలు చేస్తున్నదని అనుమానంతో గొంతు నులిమి చంపి గోనె సంచిలో కుక్కి బావిలో పడేయడం అత్యంత దారుణం అన్నారు. అదే గ్రామానికి చెందిన బోయిన మల్లయ్య తన కుమార్తె అనారోగ్యంతో ఉంటే అందుకు వీరమ్మ మంత్రాలు చేయడమే కారణమని భావించి వారి బంధువులతో కలిసి ఈ దారుణానికి పాల్పడి నిండు ప్రాణాన్ని బలిగొనడం దుర్మార్గమన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశం ప్రగతి పథంలో పయనిస్తున్నదని చెప్పుకుంటున్న తరుణంలో మంత్రాల వల్లనే అనారోగ్యాల పాలవుతున్నామని మూఢనమ్మకాలతో తోటి మనుషులను కిరాతకంగా చంపడం నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సి ఉందన్నారు. హత్యకు గురైన వీరమ్మ కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇచ్చి వారిని అన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గుర్రపు డెక్కను తొలగించేందుకు సిబ్బంది ఎందుకు...!

మృతుల చావుకు కారకులెవరు..? వారి కుటుంబాన్ని ఆదుకునేదెవరు..?

విశాలాంధ్ర - హైదరాబాద్ : చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించేం దుకు యంత్రాలను ఉపయో గించాల్సి ఉండగా సీనియర్ ఎంటమాలజిస్టులు దగ్గరుం డి సిబ్బందితో గుర్రపు డెక్కను తొలగించే సందర్భాలు అనేకం ఉన్నాయని పలువురు ఎంటమాలజీ సిబ్బంది పేర్కొంటున్నారు. బుధవారం లంగర్‌హౌస్ హుడా పార్కులోని చెరువు లో మృతి చెందడానికి కారకు లెవరు ? వారి కుటుంబాన్ని ఆదుకునేదెవరనే అభిప్రాయం సిబ్బంది నుండి వ్యక్తం అవుతోంది. యంత్రాలను పక్కన పెట్టి సిబ్బందినే ఎక్కువగా గుర్రపు డెక్క తొలగిం పునకు ఉపయోగించారని పలువురు పేర్కొంటు న్నారు. యంత్రాలతో తీసివేయించేందుకు టెంటర్లు పిలిచి పనులు జరుగుతున్నప్పటికి వాటిని పక్కన పెట్టించి రోడ్డుపై ఉండే కూలీలను పిలిపించి వారికి రోజువారి కూలి ఇచ్చి పనులు చేయించన సందర్భాలు కూడ ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. సీనియర్ ఎంటమాలజిస్టులు తెలిపితేనే చెరువులోకి దిగి గుర్రపు డెక్కను తొలగించిన పరిస్థితి ఉందని పలువురి ద్వారా తెలిసింది. లంగర్ హౌస్‌లో జరిగిన సంఘటన కూడ ఈ కోణంలోనే జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎల్.బి.నగర్, ఖైరాతాబాద్ జోనల్‌లలోని సర్కిళ్ళలోని చెరువుల్లో ఈ ఏరియా సినియర్ ఎంటమాలజిస్టు దగ్గరుండి పనులు పర్యావేక్షించిన సందర్భాలను ఎంటమాలజి సిబ్బంది ఈ సంఘటన సందర్భంగా గుర్తు చేసుకుంటున్న పరిస్థితి. సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని చెరువులోకి దించరాదనే నిబంధన ఉన్నప్పటికి ఎంటమాలజి సిబ్బందిని నేరుగా చెరువు లోకి దింపి గుర్రపు డెక్కను తొలగించే విధంగా చేయడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్లతో చేయించాల్సి పనిని కూడ సిబ్బందితో చేయిస్తు న్నారు. ఈ రెండు జోన్‌లలో గుర్రపు డెక్క తొలగింపుకు ఏ సమయంలో యంత్రాలతో పనులు చేయించారనే దానిపై విచారణ చేపట్టి ఇక్కడ యంత్రాలు నడిచాయా లేక సిబ్బందితోనే పనులు నిర్వహించారా అనే విషయంపై నిస్పార్థంగా విచారణ జరిపినట్లైతే అన్ని విషయాలు బయటపడుతాయనే అభిప్రాయం ఎంటమాలజీ సిబ్బంది నుండి వ్యక్తం అవుతోంది. తామను కూలీల మాదిరిగా చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు కేటాయించినట్లు సీనియర్ ఎంటమాలజిస్టు పనుల చేయించారని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఇలాంటి అధికారుల తీరుతోనే ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడారని పలువురు పేర్కొంటు న్నారు. ఉన్నతాధికారులు కూడ ఇలాంటి అధికారులకు వత్తాసు పలుకుతూ వారిని హక్కున చేర్చుకుంటుండ దంతోనే ఈ సీనియర్ ఎంటమాలజిస్టులు ఆడింది ఆట పాడింది పాటగా చెలామణి అవుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. డిప్యూటేషన్‌పై వచ్చిన ఈ సీనియర్ ఎంటమాలజిస్టులు ఏళ్ళ తరబడి జిహెచ్ఎం సిలో తిష్టవేసి, డిప్యూటేషన్ సమయం పూర్తి అయినా మళ్ళీ అధికారుల చేతులు తడుపుతూ తిరిగి ఇక్కడికే వస్తున్న సిరిస్థితి. ముఖ్యంగా ఎంటమాజీ విభాగంలో డిప్యూటేషన్‌పై వచ్చి దాదాపు 15 ఏళ్ళ నుండి ఈ విభాగంలోనే పని చేస్తున్న వైనం జిహెచ్ఎంసిలో కొనసాగుతు న్నారు. ఏసిబిలకు చిక్కినా కూడ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు వారిని అక్కున చేర్చుకుంటుండడం చూస్తే ఈ సీనియర్ ఎంటమాలజిస్టుల నుండి ఈ ఉన్నతాధికారులకు కూడ వాటాలు అందుతుండడంతోనే వారిని ఇక్కడ కొనసాగించేందుకు సుముకత వ్యక్తం చేస్తున్నారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైన ఏళ్ళతరబడి పాతుకుపోయిన సినియర్ ఎంటమాలజిస్టులను తక్షణమే తొలగించి కొత్తవారికి అవకాశం కల్పిస్తే అవకతవకలను అరికట్టువచ్చనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవు : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: ఆస్తి పన్ను చెల్లించకుంటే వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటి కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ గురువారం ఆస్తి పన్ను వసూల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల నందు ఆస్తిపన్ను వసూలు పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం బకాయిలు చెల్లించని వారి వద్దకు వెళ్లి ఆస్తిపన్ను చెల్లించాలని, చెల్లించలేని ఎడల మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా అన్ అసెస్మెంట్ అండర్ అసెస్మెంట్ ప్రాపర్టీలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పన్ను విధించాలని సూచించారు. గృహ యజమానుదారులందరూ ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిరాణా షాపులు, హెూటల్స్, రెస్టారెంటులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్, రెవిన్యూ ఆఫీసర్ జి ప్రభాకర్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప మైనారిటీ సోదరులు మార్చి 1వ తేదీన నుంచి రంజాన్ పండుగ మొదలవుతున్న సందర్భంగా గురువారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మసీద్ అభివృద్ధికి కృషి చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ మసీద్ అభివృద్ధి కొరకై చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మైనారిటీ సోదరులు కొలను హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎమ్ సి మైనారిటీ అధ్యక్షులు అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

చాందిని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన నెమలి అనిల్

విశాలాంధ్ర - కాప్రా : మహా శివరాత్రి సందర్భంగా మల్లాపూర్ డివిజన్ శాంతి యూత్ క్లబ్ ఎస్ వి.శశిధర్ ఆధ్వర్యంలో శాంతి యూత్ క్లబ్ మునిసిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి గ్రేటర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ యువత తప్పు దారిన పడకుండా ఇలాంటి ఆట పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ కార్యక్రమం నిర్వహించిన శశిధర్ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతి యూత్ క్లబ్ అధ్యక్షులు కొల్లూరి రవి, ప్రధాన కార్యదర్శి కోయలకొండ రాజేష్, ఉపాధ్యక్షులు మెండ రఘు, నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్, బండి సంపత్, పిఆర్. మెఘ్రాజ్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువులకు లయన్స్ క్లబ్ చేయూత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: విద్యలో రాణిస్తున్న చిన్నారుల చదువులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోపే రూ.20 వేల రూపాయల చేయూత అందించింది. చంద నగర్‌కి చెందిన నసీమకు చెందిన ఇద్దరు చిన్నారులు స్థానిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యలో రాణిస్తున్న చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెూపే చేయత అందించింది. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న చిన్నారులకు తమ క్లబ్ చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మధుసూదన రెడ్డి, శాంతి భూషణ్ రెడ్డి, మారం ప్రసాద్, సింగదసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ది ఇన్స్టిట్యూట్ అఫ్ ఛార్టర్డ్ అకౌంట్స్ అఫ్ ఇండియా సదరన్ రీజినల్ కౌన్సిల్

హైదరాబాద్ నూతన కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ది ఇన్స్టిట్యూట్ అఫ్ ఛార్టర్డ్ అకౌంట్స్ అఫ్ ఇండియా సదరన్ రీజినల్ కౌన్సిల్, హైదరాబాద్ బ్రాంచ్ నూతన కార్యవర్గంని ఏర్పాటు చేయటం జరిగింది. సభ్యులు తమ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి, రెడ్‌హిల్స్‌లోని సంస్థ ఆఫీసులో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో 2025-2026 సంవత్సరానికి చైర్మన్‌గా సి.ఏ. చిన్న సీతారామిరెడ్డి అన్నపురెడ్డి, వైస్ చైర్మన్‌గా సి.ఏ. గింధారి లాల్ తోష్నివార్, సెక్రటరీ గా సి.ఏ. కారుమంచి రామా రావు, కోశాధికారిగా సి.ఏ. నాగ హర్షవర్ధన్ రెడ్డి శీలం, సి.ఏ.ముక్కర సాయి చరణ్ రెడ్డి సికాస చైర్మన్ గాను, సి.ఏ. గోనుగుంట మురళి సికాస కో చైర్మన్ గాను ఎన్నికఅయినరు. సి.ఏ. ఉప్పలపాటి శరణ్ కుమార్, సి.ఏ. కుమార్ పాల్ టాటెడ్, సి.ఏ. శైలేష్ ఖండేల్ వాల్ మిగిలిన కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశానికి ఐసిఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సి.ఏ. దయనివాస్ శర్మ, సి.ఏ. ముప్పాళ్ల శ్రీధర్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు సి.ఏ భాను నారాయణ రావు, సి.ఏ. చెంగల్ రెడ్డి, సి.ఏ. సునీల్ కుమార్ మండవ, సి.ఏ. యర్రా తిరుపతయ్య, సి.ఏ. దీపక్ లడ్డా తదితరులు పాల్గొన్నారు. గత కమిటీ సభ్యులు సంస్థకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి గౌరవించారు.

మోదీ డైరెక్షన్‌లో పనిచేస్తున్న సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రధాని మోదీ డైరెక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఆయన ఆరెస్సెస్ సీఎంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ప్రతీ విషయంలో బీజేపీతో సీఎం రేవంత్ రెడ్డి కలిసి పనిచేస్తున్నారని అందుకే బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారని విమర్శించారు. మేము వాస్తవాలు బయటపెట్టగానే బీజేపీ నాయకులు తిరిగి మాపై ఎదురుదాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలో అహంకారానికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్ ఎనమల రేవంత్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. గురువారం నాడు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైందని, ప్రధానిని కలిసిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌పై కేసులు పెడుతామని రేవంత్ రెడ్డి అంటున్నారని, లేనిపోని విషయాలు తెచ్చి మాకు అంటగడుతున్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడమే తప్పా సీఎంకు ఇంకో ఆలోచన లేదని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం అంటే కట్టుబాట్లతో కూడిన కుటుంబం అని, మేము ఎప్పుడూ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించలేదని, కానీ రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రధానిని కలిసిన తర్వాత తన సోదరుడు తిరుపతిరెడ్డి తన నియోజకవర్గ ఇన్‌చార్జి అని సీఎం చెప్పుకున్నారని, పార్టీ పరంగా ఇన్‌చార్జి అయితే మాకు ఇబ్బంది లేదు, కానీ అధికారిక సమావేశాల్లో ఎందుకు పాల్గొంటున్నారని నిలదీశారు. తిరుపతి రెడ్డికి కలెక్టర్ ఎందుకు ఎదురెళ్లి స్వాగతం చెబుతున్నారు అంటే రాజ్యాంగేతర శక్తులను ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నట్లు కదా అని ప్రశ్నించారు. గుమ్మడి నర్సయ్య వంటి మహోన్నతమైన వ్యక్తిని గేటు బయట నిలబెట్టి రేవంత్ రెడ్డి అహంకారాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచంగా ఉన్న కేసీఆర్ కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలన్నది సీఎం దురాలోచన అని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి తెలంగాణకు రక్షణకవచంగా ఉన్న బీఆర్ఎస్ పై కుట్రలు చేస్తున్నాయని, న్యాయవాది సంజీవ రెడ్డి కోర్టులో వాదిస్తూ అందరి ముందే ఆరు నెలల క్రితమే గుండె పోటుతో మరణించారన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలని అన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంజాన్ మాసానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని మార్చ్ 1 నుండి ప్రారంభం కాబోయే రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు సంబంధిత శాఖ కృషి చేసే విధంగా సహకరించాలని పట్టణ ముస్లిం ప్రముఖులు, నాయకులు షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేయడం జరిగింది.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు బాబర్ అలీఖాన్, ఎండి. ఇబ్రహీంలు తదితరులు మున్సిపల్ కమిషనర్‌ను గురువారం స్వయంగా కలుసుకొని రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్ల గురించి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షల సందర్భంగా మంచినీరు, వీధుల్లో విద్యుత్తు దీపాలు ఆయా ముస్లిం బస్తీలలో రోడ్ల పారిశుధ్యం తదితర అంశాలను కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి. ఇబ్రహీం, ఖదీర్, ముబారక్, పాషా, కబీర్, జాఫర్, అలీం సఖిబ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాదికి తీరని అన్యాయం

పునర్విభజనపై అమిత్‌షా వ్యాఖ్యలు నమ్మలేం: సిద్దరామయ్య

బెంగళూరు: ప్రస్తుతమున్న జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన ప్రక్రియ చేపట్టడం వల్ల దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలనూ నమ్మలేమన్నారు. దక్షిణాది రాష్ట్రాలను గందరగోళానికి గురిచేసేలా అమిత్‌షా మాట్లాడారని, ఆయన ఉద్దేశపూర్వకంగా కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం కలిగించాలని అనుకుంటున్నారా లేక ఆయనకు సరైన సమాచారం లేదా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. జాతీయ స్థాయిలో తమ సమస్యలను లేవనెత్తకుండా పార్లమెంటులో దక్షిణ రాష్ట్రాల గొంతు నొక్కే అస్త్రంగా పునర్విభజన ఉన్నదని సిద్దరామయ్య దుయ్యబట్టారు. తాజా పునర్విభజన ప్రక్రియను జనాభా ఆధారంగా నిర్వహిస్తే కర్నాటకతో సహా దక్షిణాది రాష్ట్రాల స్థానాలు లోక్‌సభలో తగ్గిపోతాయని, ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు దక్కుతాయని అన్నారు. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గకుండా అంతే ఉన్నా కానీ నష్టం తప్పదని... దీని గురించి హోంమంత్రికి తెలియదా అని సీఎం ప్రశ్నించారు. పునర్విభజనపై అనేక అధ్యయ నాలను ప్రస్తావించారు. ఇప్పుడున్న జనాభా ఆధారంగా ఈ ప్రక్రియ చేపడితే కర్నాటకకు లోక్‌సభలో స్థానాలు 28 నుంచి 26కు తగ్గుతాయన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు 42 నుంచి 34కు, కేరళకు 20 నుంచి 12, తమిళనాడుకు 39 నుంచి 31 స్థానాలకు తగ్గిపోతాయని సిద్దరామయ్య వెల్లడించారు. మరోవైపు యూపీకి లోక్‌సభ స్థానాలు 80 నుంచి 91కు పెరుగుతాయని, బీహార్‌కు 40 నుంచి 50కు, మధ్యప్రదేశ్ స్థానాలు 29 నుంచి 33కు పెరుగుతాయన్నారు. ఇది అన్యాయం కాకపోతే మరేమిటని సిద్దరామయ్య ప్రశ్నించారు. దీనిని ఆమోదించలేమన్నారు. దక్షిణాదికి న్యాయం చేసే చిత్తశుద్ధి కేంద్రానికి ఉంటే పునర్విభజన ప్రక్రియ అన్నది ప్రస్తుతం లోక్‌సభ స్థానాల సంఖ్య లేక ప్రస్తుత జనాభా నిష్పత్తి ఆధారంగా జరుగుతుందా లేదా అన్నది హోంమంత్రి స్పష్టం చేయాలని సిద్దరామయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు నష్టం జరగకుండా ఉండేం దుకే గతంలో 1971 జనభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగిందని గుర్తుచేశారు. దక్షిణాది రాష్ట్రాలు 50 ఏళ్లుగా అభివృద్ధిలో, జనాభా నియంత్రణలో ముందున్నాయని, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అభివృద్ధిలో కుంటుపడటమే కాకుండా జనాభా నియంత్రణ లోనూ విఫలమయ్యాయని సిద్దరామయ్య విమర్శించారు.

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆదాయం పెంపునకు చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వయం సహాయక సంఘాలతో పాటు రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్‌పీఓ) సభ్యులకు ఆదాయం పెరిగే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలిచ్చారు. సచివాలయం లోని ఐదో బ్లాకులోని తన కార్యాలయంలో సెర్ప్ అధికారులు, ఫాంవేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్‌మెంట్ సర్వీస్, ఫ్లిప్ కార్ట్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులకు అత్యధిక ధర వచ్చేలా తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)తో ఆయా కంపెనీలు అవగాహన ఒప్పందాలు చేసుకునేలా సమావేశం నిర్ణయించింది. మహిళా సభ్యులకు ఆదాయం పెరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి శ్రీనివాస్ సూచించారు. సమావేశంలో సెర్ప్ సీఈవో కరుణ, డైరెక్టర్ పద్మావతి, ఐఏఎం బెంగళూరు ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి, మిల్లెట్ బ్యాక్స్ సీఈవో విశాల, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసెస్ సీఈవో రజిని, డైరెక్టర్ హెచ్ యస్ విశ్వనాథ్, ఫ్లిప్కార్ట్ ప్రాజెక్ట్ హెడ్ దీపూజ్యోషి పాల్గొన్నారు.

నేరగాళ్లు... దయకు అనర్హులు

చండీగఢ్: తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించారన్న నెపంతో చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు వేసి ప్రత్యేక సైనిక విమానాలలో భారతీయులను అమానవీయ రీతిలో స్వదేశానికి అమెరికా తిప్పి పంపింది. ఇలా తిరిగి వచ్చిన వారిని నేరగాళ్లు, దయకు అనర్హులు అంటూ కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వద్దని వారించినా వినకుండా మనవాళ్లు అక్రమ మార్గాల్లో ఇతర దేశాల్లోకి ప్రవేశిస్తున్నారన్నారు. ఇది మాదక ద్రవ్యాల వ్యసనం వంటిదని హర్యానా మాజీ సీఎం వ్యాఖ్యానించారు. ఎలాంటి పరిస్థితుల్లో వారిని తిప్పి పంపారన్నది మాకు ముఖ్యం కాదు. వీరికి పునరావాసం ఎలా కల్పించాలన్నదే మాకున్న సమస్య అని ఆయనన్నారు.

కఠోర సాధనతో క్రీడల్లో రాణింపు

ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష

విశాలాంధ్ర-మంగళగిరి: అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యను అందిస్తోన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్రీడల్లోనూ ప్రథమ స్థానంలో నిలబడటం అభినందనీయమని ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ (ఐఓఏ) ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యురాలు, పద్మశ్రీ పీటీ ఉష అన్నారు. క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులను అందిస్తోన్న వర్సిటీ యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. గురువారం సాయంత్రం ఏపీఎస్ఎం యూనివర్సిటీలో ఉద్గమ్-25 జాతీయ క్రీడోత్సవాలను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మనోజ్ ఆరోరా అధ్యక్షతన జరిగిన క్రీడల ప్రారంభ సభలో ప్రసంగించారు. కృషి, పట్టుదల, ఏకాగ్రతతో సాధన చేస్తే క్రీడల్లో అత్యుత్తమంగా రాణించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఇస్తోన్న ప్రాధాన్యత ప్రశంసనీయమన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో సంఘటిత శక్తి పెరిగి తద్వారా విజయసోపానాలు అందుబాటులోకి వస్తాయన్నారు. మనసుపెట్టి ఆడాలి... అప్పుడే మనలోని అసలైన క్రీడాశక్తి బయటకొస్తుందని విద్యార్థులకు సూచించారు. ఎన్నో సవాళ్లను అధిగమించి క్రీడల్లో ప్రతిభ చూపడం వల్లనే తాను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నానని తెలిపారు. చదువుకున్న విశ్వవిద్యాలయానికి, దేశానికి పేరు తెచ్చేందుకు విద్యార్థులు శ్రమించాలని కోరారు. ఆచార్య మనోజ్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా జరిగిన ఒలింపిక్స్‌లో వర్సిటీ విద్యార్థులు పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అనూప్ సింగ్, అసిట్ డైరెక్టర్ సునితలు క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు 2 వేల మందికి పైగా పాల్గొంటున్నారన్నారు. వాలీబాల్, క్రికెట్, పుట్‌బాల్ వంటి క్రీడలతో పాటు అథ్లెటిక్స్‌లోనూ పోటీలు జరుగుతున్నా యన్నారు. మార్చి 1న జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు రూ.10 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందన ర్యాలీ జరిగింది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడల్లో రాణిస్తున్న జెస్సీ రాజ్(స్కేటింగ్), బాల ప్రసాదరెడ్డి(రన్నింగ్), ఆకుల హైమలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్ కుమార్, డీన్ వినాయర్, సీఎఫ్ఏఓ సుమ, రీసెర్చ్ డీన్ రంజిత్, డైరెక్టర్ సిద్ధార్థ ప్రసారీ, డైరెక్టర్ రేవతీ బాలకృష్ణ, శ్రీపతి, వంశీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థులకు
స్టైఫండ్ పెంచాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గన్నవరం: మెడికల్ విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పశువైద్య విద్యార్థుల రిలే దీక్ష గురువారం 25వ రోజుకు చేరుకోగా వారికి రైతు సంఘం నాయకులు మద్దతు ప్రటించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమ్మలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాట్రగడ్డ రామచంద్ర జోషి, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు కేశవరావు, మధు ప్రసాద్ బాబు, వీరబాబు మాజీ ఐఏఎస్ ముక్కమాల ఉమా మహేశ్వరవు, రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి పోతురాజు నాగేశ్వరవు తదితరులు విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మూగ జీవాలకు వైద్య సేవలు అందించే దాక్టర్లను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. మన రాష్ట్రంతో పోల్చితే ఇతర రాష్ట్రాల్లో వీరికి స్టైఫండ్ ఎక్కువగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పశువైద్య విద్యార్థులకు స్టైఫెండ్ పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు శాంతియుతంగా ఉద్యమాన్ని సాగించాలని... పోరాటాన్ని ఉధృతం చేయాలంటే తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని కేవీవీ ప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో స్థానిక ఎమ్మెల్యేలకు వినతులు అందజేయాలని సూచించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేశ్ దృష్టికి విద్యార్థుల సమస్యను తీసుకెళ్లి... పరిష్కారానికి కృషిచేస్తానని కేవీవీ ప్రసాద్ హామీనిచ్చారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, పాడి పరిశ్రమకు కోట్లల్లో ఆదాయం వస్తున్నా ముగ జీవాలకు వైద్యం చేస్తున్న దాక్టర్లను నిర్లక్ష్యం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటంలో విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తామని అన్నారు. ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకొని పశువైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచించారు.

మౌజన్లు, ఇమామ్‌లకు అందిన గౌరవ వేతనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మౌజన్లు, ఇమామ్‌లకు ఆరు నెలల గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు చెల్లించింది. ఐదు వేల మంది చొప్పున ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాల చెల్లింపునకు ఈనెల 18న రూ.45కోట్లను విడుదల చేసింది. దీంతో వేతనాల చెల్లింపు ప్రక్రియ ముగిసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం అమరావతిలో ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ మాసం ప్రారంభానికి ముందుగా ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు అందడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తిలో రికార్డు

నూరు రోజుల్లో 1,596.30 మిలియన్ యూనిట్‌లు
సామర్థ్యం పెంపుకు నిరంతర కృషి: జెన్కో ఎండీ చక్రధర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (డీఎస్‌టీపీఎస్) మూడవ యూనిట్ (800 మెగావాట్లు) ప్రారంభమైన నాటి నుంచి నిరంతరాయంగా 100 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేసిందని ఏపీ జెన్కో ఎండీ కె.వి.ఎస్.చక్రధర్ బాబు తెలిపారు. ఇది జెన్కో నిర్వహణ సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇందుకు ప్రధాన కారణం అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు, సిబ్బందే అని ఆయన పేర్కొన్నారు. 2024 నవంబరు 18 నుంచి మూడవ యూనిట్ సుదీర్ఘంగా విద్యుత్ ఉత్పత్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన సిబ్బందిని, ఇంజినీర్లను అభినందించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు జెన్కో కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహాయ సహకారాలు, దిశానిర్దేశాలతో విద్యుత్ ఉత్పత్తిలో జెన్కో రికార్డులు నెలకొల్పుతుందని వివరించారు. నూరు రోజుల్లో 1,596.30 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయగా, 83 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) తో అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. రోజుకు 45 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో 40శాతం వాటా కలిగి ఉందని పేర్కొన్నారు. యూనిట్ స్థిరంగా కొనసాగించేందుకు అధునాతన నిర్వహణ విధానాలు, సాంకేతిక ఆధునికత విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి నుంచి 110 మిలియన్ యూనిట్లు పైగా స్థిర విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తూ, ఈ నెల 22 న 123 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తితో సరి కొత్త రికార్డ్ నెలకొల్పిందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు జెన్కో నిరంతరంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. 95 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌తో 18.234 మిలియన్ యూనిట్ల గరిష్ట విద్యుత్ ఉత్పత్తిని ఈ నెల 18న సాధించినట్లు చెప్పారు. బొగ్గు నిల్వలను మరింత మెరుగుపరచి ఏడు రోజుల పాటు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోనే రోల్ మోడల్‌గా ఏపీ జెన్కో నిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్, రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు జెన్కో తనవంతు తోడ్పాటు అందిస్తుందని అన్నారు.

అక్రమాలకు తెగబడిన అధికార పార్టీ

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

విశాలాంధ్ర-మంగళగిరి: కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడిందని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. మంగళగిరి సీకే హైస్కూల్లో గల పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లంకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని పోలింగ్ బూత్‌లలో తమ ఏజెంట్లను బయటకు పంపారని విమర్శించారు. ఇదేమి న్యాయం? మీకు చేతనైతే తలపడండి? అంతేగానీ ఏజెంట్లను అలా బయటకు పంపడం ఏంటి అని లక్ష్మణరావు ప్రశ్నించారు. తెనాలి మున్సిపల్ హైస్కూల్‌లోని ఏడు బూత్‌లలో కోగంటి శివయ్య అనే వ్యక్తి పెద్దఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. మంగళగిరిలోనూ ఆ విధంగానే జరిగిందన్నారు. అధికార పార్టీ నేతలు గేటు దాకా వచ్చి ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. వీటన్నింటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నామన్నారు. ప్రజల మద్దతు, పట్టభద్రుల మద్దతు పొందండి. వారి మద్దతు పొందలేకనే ఇలాంటి పద్ధతులకు పాల్పడుతున్నారన్నారు. అధికార పార్టీ నేతల చర్యలను తాము ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీ ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘం అధికారి వివేక్ యాదవ్‌కు, ఆర్వో, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు

సీపీఐ సీనియర్ నాయకుడు రాజు మృతి

కొచ్చి: సీపీఐ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ శాసనసభ్యుడు పి.రాజు (73) మృతి చెందారు. ఆయన కొచ్చిలోని రినై మెడిసిటీలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. రాజు సీపీఐ కేరళ రాష్ట్ర సమితి సభ్యుడు. ఎర్నాకులం జిల్లా కార్యదర్శిగా అనేక సంవత్సరాలు పనిచేశారు. 1951 జులై 18న ఎస్.శివన్ పిల్లయ్ (మాజీ ఎమ్మెల్యే), సి.చెల్లమ్మ దంపతులకు రాజు జన్మించారు. పార్టీలో కీలక పదవులు చేపట్టారు. 1991 నుంచి 2001 వరకు రెండు సార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కేరళ అసెంబ్లీ అంచనాల కమిటీ (1998-2001)కి చైర్మన్‌గా వ్యవహరించారు. ఏఐవైఎఫ్ ఎర్నాకులం జిల్లా కమిటీ అధ్యక్షుడిగా, సీయూఎస్ఏటీ సెనేట్ సభ్యుడిగా, ఏఐటీయూసీ కేరళ రాష్ట్ర సమితి ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. మత్స్యకారుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. సీపీఐ అధికారిక పత్రిక జనయుగం కొచ్చి శాఖ మేనేజర్‌గానూ పనిచేశారు. రాజు భౌతికకాయాన్ని శుక్రవారం పరువూరు నియోజకవర్గానికి తరలిస్తారు. అదే రోజు సాయంత్రం ఆయన నివాసం ఆవరణలో అంత్యక్రియలు జరుగుతాయి. రాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. సీపీఐకి, కేరళ ప్రజలకు రాజు చేసిన సేవలు మరువలేనివి అంటూ ఆయన మృతికి బంధుమిత్రులు, సహచరులు, శ్రేయోభిలాషులు సంతాపం తెలిపారు. సీపీఐ ఎంపీ పీపీ సునీర్ ఫేస్‌బుక్ మాధ్యమంగా సంతాపం ప్రకటించారు.

జేవీఎస్ మూర్తి నివాళి

విశాలాంధ్ర-విశాఖ: సీపీఐ సీనియర్ నాయకుడు రాజు మరణం ఆలిండియా ఫిష్ వర్కర్స్ ఫెడరేషన్‌కి, పార్టీకి తీరని లోటని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. రాజు మరణానికి సంతాపం ప్రకటించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెయ్యల నాగభూషణరావు కూడా సంతాపం ప్రకటించారు. రాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజుతో కలిసి పనిచేసిన అనుభవాలు, ఆయనతో ఉన్న జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

ముప్పాళ్ల సోదరుడి మృతి

విశాలాంధ్ర-తాడికొండ: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పెద్ద తమ్ముడు ముప్పాళ్ల నారాయణరావు (66) విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీనియర్ నాయకులు పచ్చల సాంబశివరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంజుల విఠల్ రెడ్డి, సీనియర్ నాయకులు వెలువోలు సాంబశివరావు, రమణ తదితరులు పొన్నెకల్లులో నారాయణరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరావు సోదరులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు వారి కుటుంబ సభ్యులకు సానుభూతి, సంతాపం తెలియజేశారు. నారాయణరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు తాడికొండ నియోజకవర్గంలోని వారి స్వగ్రామం పొన్నెకల్లులో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్లు మరో 3 నెలల పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కాల పరిమితిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 1వ తేదీ నుంచి మే 31 వరకు గడువు పొడిగిస్తూ, రాష్ట్ర సమాచారశాఖ సర్క్యులర్ జారీజేసింది. గతంలో ఇచ్చిన అక్రిడేషన్ గడువు ఈనెల 28వ తేదీతో ముగియనుంది.

నా భర్తను వేధిస్తున్నారు

వంశీ భార్య పంకజశ్రీ ఆరోపణ

విశాలాంధ్ర-విజయవాడ: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారంలో అరెస్టయి... జైలులో ఉన్న తన భర్త వల్లభనేని వంశీ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆయన భార్య పంకజ శ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా తన భర్తను అర్థం పర్థం లేకుండా... కేసుకు సంబంధం లేని ప్రశ్నలతో విసిగించారని ఆందోళన చెందారు. వంశీని ఆస్తమా సమస్య ఇబ్బంది పెడుతోన్నదని తెలిపారు. వంశీ పడుతోన్న అనారోగ్య సమస్యలను న్యాయమూర్తి ఎదుట విన్నవించినట్లు చెప్పారు. అయితే తాను తాత్కాలిక న్యాయమూర్తినని, రెగ్యులర్ న్యాయమూర్తి వచ్చిన తర్వాత పిటిషన్ వేసుకోవచ్చని ఆయన సూచించారని వంశీ భార్య పంకజ శ్రీ పేర్కొన్నారు. మూడు రోజులు కోర్టు అనుమతించిన పోలీస్ కస్టడీ తర్వాత మళ్లీ వల్లభనేని వంశీని సబ్ జైలుకు తరలించారన్నారు. కాగా, కేసుకు సంబంధం లేని ప్రశ్నలతో వంశీని ఇబ్బంది పెట్టారని ఆయన తరపు న్యాయవాది తానికొండ చిరంజీవి విమర్శించారు. ఈ కేసులో బలం లేకపోయినా...అనవసర వాదనలు చేస్తున్నారని, అయితే ఇవి న్యాయస్థానం ముందు నిలిచే కేసులు కావని న్యాయవాది అన్నారు.

మరోవైపు, ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిలో కీలక సాక్షిగా ఉన్న సత్యవర్ధన్‌ను బెదిరించి... భయపెట్టి కేసు తారుమారు చేయాలని చూశారని తెలిపారు. సత్యవర్ధన్‌ను వంశీతోపాటు అతడి అనుచరులు కిడ్నాప్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతికపరమైన ఆధారాలు సేకరించామని చెప్పారు. కోర్టు ఆదేశాలతో మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని వల్లభనేని వంశీని ప్రశ్నించామన్నారు. కొన్ని ప్రశ్నలకు అవునని, మరికొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పలేదన్నారు. కనిపించకుండా పోయిన ఫోన్ గురించి అడిగినా తనకు తెలియదంటూ సమాధానమిచ్చారన్నారు. ఫిబ్రవరి 12వ తేదీన హైదరాబాద్ నుంచి వచ్చి వైఎస్ జగన్‌ను కలిసినట్లు వల్లభనేని వంశీ అంగీకరించారన్నారు. అయితే తమకు ఇంకా పూర్తి సమాచారం రావాల్సి ఉందని తెలిపారు. వల్లభనేని వంశీని మరోసారి కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్ వేస్తామని ఏసీపీ దామోదర్ స్పష్టం చేశారు. జైలులో ఒక బ్యారక్ కాకుండా ఇతరులున్న బ్యారక్ వంశీ అడిగారన్నారు. ఈ కేసులో ఇతర ముద్దాయిలను సైతం కస్టడీ కోరుతూ ఇప్పటికే కోర్టులో పిటిషన్ వేశామని ఏసీపీ దామోదర్ తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.